ఈనాడు కర్నూలు

శుక్రవారం సెప్టెంబరు 27, 2024



కలెక్టరేట్ ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా తదితరులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

■ కలెక్టరేట్‌లో స్వచ్ఛతాహి సేవ

స్పందనకు వందనం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదేశించారు. 'పరిపాలన భవనం.. స్వచ్ఛత కనం' శీర్షికన 'ఈనాడు'లో సెప్టెంబరు 25న చిత్ర వార్త ప్రచురితమైంది. స్పందించిన ఆయన కలెక్టరేట్‌లో గురువారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జేసీ డా. బి.నవ్య, డీఆర్వో చిరంజీవి, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి అవినాష్ జయసింహ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వారానికి ఒకసారి కార్యాలయాలు, పరిసరాలు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలోని పిచ్చి మొక్కలు, చెత్త తొలగించి మొక్కలు నాటారు. అగ్నిమాపక వాహనం నీటితో కలెక్టరేట్ ఆవరణను శుభ్రం చేయించారు.

గత పాలకులు జగన్నాథగట్టుపై క్లస్టర్ విశ్వవిద్యాలయం పేరుతో అక్రమాల కథ నడిపారు.. వర్సిటీ అధికారులకు సమాచారం లేకుండానే భూ కేటాయింపులు చేశారు. ప్రాంగణ నిర్మాణ వ్యయాన్ని రూ. 88.50 కోట్ల నుంచి రూ. 139.50 కోట్లకు పెంచారు. నిర్మాణ సంస్థకు ఇప్పటివరకు రూ. 46 కోట్లు విడుదల చేయగా మరో రూ. 17 కోట్లు చెల్లించేందుకు రంగం సిద్ధం చేశారు.. ఇన్ని కోట్లు ఖర్చు పెట్టినా ఒక్క భవనం పూర్తికాలేదు. అక్రమాలపై 'కూటమి' ప్రభుత్వం విచారణ చేసి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని విద్యార్థులు విన్నవిస్తున్నారు. ఈనాడు, కర్నూలు:



క్లస్టర్ గూడు.. అక్రమాలు చూడు

■ గుట్టుగా భూ కేటాయింపులు

సిల్వర్ జూబ్లీ, కేవీఆర్, ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలను కలిపి క్లస్టర్ విశ్వవిద్యాలయంగా మార్చారు. జగన్నాథగట్టుపై నూతన ప్రాంగణం నిర్మించాలని నిర్ణయించారు. నిర్మాణ బాధ్యతలు వైకాపా పెద్దలకు చెందిన సంస్థ డీఈసీ తీసుకొంది. పనుల ప్రారంభం మొదలు పలు వివాదాలు వెలుగుచూశాయి. విశ్వవిద్యాలయానికి కేటాయించాల్సిన భూమిని ఏపీఈడబ్ల్యూఐడీసీ (ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)కి కేటాయించారు. ఇదంతా గుట్టుగా జరిగింది.

వర్సిటీ అధికారుల ఫిర్యాదులు బుట్టదాఖలు

విశ్వవిద్యాలయ విధివిధానాలతో సంబంధం లేకుండా, కనీసం సమాచారం ఇవ్వకుండానే ఆకార్ ఆర్కిటెక్ట్స్ సంస్థకు రూ. 39.83 లక్షలు చెల్లించారు. ఈ విషయంపై పూర్వ రిజిస్ట్రార్ శ్రీనివాసులు నాటి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ పంపిన ప్రతిపాదనలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఉన్నతవిద్యాశాఖ అధికారులు గతంలో వర్సిటీ అధికారులను ఆదేశించారు. ఆ భూమే విశ్వవిద్యాలయం పేరుతో లేనపుడు తాము ఎలా నివేదిక ఇస్తామని వర్సిటీ అధికారులు సమాధానం ఇచ్చారు.

ప్రత్యేక డివిజన్ ఓ నాటకం

కర్నూలులో ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్యాలయం ఉంది. అయినా క్లస్టర్ విశ్వవిద్యాలయ నిర్మాణ బాధ్యతలను పర్యవేక్షించే అధికారాన్ని స్థానిక కార్యాలయ అధికారులకు అప్పగించలేదు. ప్రత్యేకంగా కర్నూలులోనే మరో డివిజన్ ఏర్పాటుచేశారు. అనంతపురం కార్యాలయ ఈఈకి బాధ్యతలు అప్పగించారు. అప్పటి మంత్రి సూచనల మేరకే ఇష్టారాజ్యంగా ప్రత్యేక డివిజన్‌ను ఏర్పాటుచేశారన్న ఆరోపణలున్నాయి.

ఒక్కటీ పూర్తి చేయలేదు

మొదటిదశలో రూ. 88.50 కోట్లతో తరగతి గదులు, ప్రయోగశాలలు ఉండేలా 92,660 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఒక భవనం, 67,211 ఎస్ఎఫ్‌టీతో మరో భవనం నిర్మించాలి. పరిపాలన విభాగం, గ్రంథాలయం, కంప్యూటర్ సెంటర్ ఉండేలా 78,095ఎస్. ఎఫ్. టి. తో మరో భవనం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ (55,745 ఎస్. ఎఫ్. టి.), విద్యార్థినుల వసతి గృహం(88,145 ఎస్. ఎఫ్. టి.), విద్యార్థుల వసతి గృహం(88,145 ఎస్. ఎఫ్. టి.), ఉద్యోగుల వసతి గృహాల (10,000 ఎస్. ఎఫ్. టి.) నిర్మించాలి. ఇప్పటి వరకు కేవలం 45 శాతం పనులే పూర్తయ్యాయి. ప్రస్తుతం నిలిచిపోయిన పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.



వానరాలు వస్తున్నాయని.. వనాన్ని కూల్చారు

ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో కోతుల బెడద ఉందంటూ మూడు దశాబ్దాలుగా గట్లపై ఉన్న 30కిపైగా చెట్లను నరికేశారు. గట్లపైనున్న చెట్ల కొమ్మలు కత్తిరిస్తే సరిపోయేదని, పచ్చదనంతో బనవాసి ఫారానికి ఆహ్లాదాన్ని తెస్తున్న పచ్చని చెట్లను నరికేయడంపై విమర్శలు వస్తున్నాయి. 50 ఎకరాల కృషి విజ్ఞాన కేంద్రం చుట్టూ ఉన్న పొలాల్లోనూ వందలాది చెట్లు ఉన్నాయి. వాటిపై కోతులు నివాసం ఏర్పరచుకుని కృషి విజ్ఞాన కేంద్రంలో వేసిన నమూనా పంటలకు చేటుగా మారాయని ఉన్నతాధికారుల అనుమతితో చెట్లను కొట్టినట్లు కృషి విజ్ఞాన కేంద్రం మేనేజర్ సుమంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే:

పర్యాటకానికి ప్రగతి తోరణం

■ వంద రోజుల ప్రణాళిక తయారీ

■ అభివృద్ధికి ముందుకొచ్చిన కేంద్రం

■ నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



నల్లమల అందాలు.. ఆధ్యాత్మిక క్షేత్రాలు.. చారిత్రక నిర్మాణాలకు నెలవైన ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యాటకులకు స్వర్గధామం. ఎన్నో దర్శనీయ స్థలాలున్నా గత వైకాపా ప్రభుత్వ విధానాలు పర్యాటక ప్రగతికి సంకెళ్లుగా మారాయి.. ఆయా ప్రాంతాల్లో కనీసం మంచి నీటి సౌకర్యం కల్పించలేకపోయారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పర్యాటక ప్రగతికి తలుపులు తెరిచింది. గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన పర్యాటకరంగం ఇక చకచకా ముందడుగు వేయనుంది. కార్యరూపం దాలిస్తే.. స్థానికులకు ఉపాధి లభించడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

–న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

పత్తికొండకు అండ

పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండలం జి.ఎర్రగుడి గ్రామ సమీపంలో అశోకుని శాసనాలు ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు రూ. కోటి ఖర్చు అయ్యే అవకాశం ఉందని లెక్కలేశారు. రెస్టారెంట్ నిర్మాణంతో పాటు ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు. ఉద్యానవనాలను అభివృద్ధి చేయనున్నారు.

బనవాసి.. ఇక ఖుషీ

ఎమ్మిగనూరులోని బనవాసి ప్రాంతానికి పర్యాటక కళ తెచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఫుడ్‌కోర్టు నిర్మాణం, కిడ్స్ పార్కుతో పాటు ఆహ్లాదం కలిగే విధంగా వివిధ వసతి సౌకర్యాలు కల్పించనున్నారు. పర్యాటకులు సేద తీరే విధంగా రెస్టారెంట్లు, అమ్యూజ్‌మెంట్ పార్కును రూ. 2 కోట్లతో తీర్చిదిద్దనున్నారు.

తుంగభద్ర అలలపై విహరించేలా

సుంకేసుల జలాశయంలో బోటింగ్‌తో పాటు పర్యాటక రెస్టారెంట్లు నెలకొల్పాలని ప్రతిపాదించారు. బోట్లలో పర్యాటకులు జలాశయం మొత్తం తిరిగొచ్చేలా ఏర్పాట్లు చేయనున్నారు. బనవాసి నుంచి సుంకేసుల వరకు పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు కానుంది.


ఓర్వకల్లుకు తీగ మార్గం

ఓర్వకల్లు రాక్ గార్డెన్స్‌లో ప్రస్తుతం పర్యాటకుల సందడి ఎక్కువగా ఉంటోంది. సమీపంలో విమానాశ్రయం ఉండటంతో ఇక్కడ పర్యాటకులకు అదనపు సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ప్రతిపాదనలు చేస్తున్నారు. రోప్‌వే ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఏర్పాటు చేయాలనే విషయంపై పర్యాటక శాఖ అధికారులు ఆలోచిస్తున్నారు. ఆదిమానవుడు సంచరించిన కేతవరం కొండలనూ కలుపుతూ పర్యాటన నడవా ఏర్పాటు చేసే దిశలో ప్రయత్నాలు సాగుతున్నాయి.

వచ్చిన పర్యాటకుల సంఖ్య

ఏడాది	నంద్యాల	కర్నూలు
2022-23	1,21,32,623	1,41,24,011
2023-24	1,29,26,768	1,56,95,568

అహోబిలం.. ఆధ్యాత్మికం.. ఆహ్లాదం



ఛాలెంజ్-2 పథకం కింద అహోబిలంలో రోప్‌వే ఏర్పాటుకు కేంద్రం గతంలోనే అంగీకరించింది. వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ముందుకు సాగలేదు. ఎగువ, దిగువ అహోబిలాల్లో రోప్‌వే ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయమై ప్రభుత్వం సర్వే చేయనున్నారు.

పశ్చిమాన నవోదయం

✤ ఆదోని పట్టణ సమీపంలో రాంజల చెరువును రూ. 2 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. చెరువులో బోటింగ్ సౌకర్యం కల్పించనున్నారు. రెస్టారెంట్ నిర్మాణంతో పాటు ఉద్యానవనాన్ని తీర్చిదిద్దనున్నారు.

✤ ఆదోని సమీపంలోని పెద్ద తుంబళం శివార్లలోని జైన్ ఆలయాన్ని రూ. 3 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ ఫుడ్ కోర్టుతోపాటు పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు.

✤ గాజులదిన్నె జలాశయం వద్ద రెస్టారెంట్ నిర్మాణంతో పాటు బోటింగ్ సౌకర్యం కల్పించనున్నారు. పార్కు, ఆట పరికరాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఒక్కరోజులోనే నవనందులను చూసేలా



నంద్యాల చుట్టు పక్కల 15 కి.మీల పరిధిలో ఉన్న నవనంది క్షేత్రాలను దర్శించే విధంగా ప్రత్యేక పర్యాటక మార్గాలను ఏర్పాటు చేయనున్నారు. ఆయా క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను తిప్పనున్నారు. ఒకేరోజు అన్ని ఆలయాలు సందర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఆలయాల వద్ద ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

శ్రీగిరికి కొత్త శోభ

● సంగమేశ్వరం- శ్రీశైలం మధ్య ప్రత్యేక నడువాను తీర్చిదిద్దనున్నారు. సంగమేశ్వరం వద్ద త్వరలో తీగల వంతెన నిర్మాణం ప్రారంభం కానుంది. దీన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దనున్నారు. ఇక్కడి నుంచి శ్రీశైలానికి జల మార్గంలో వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కారిడార్ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు హామీ కూడా ఇచ్చారు. త్వరలో నిధుల కేటాయింపు జరగనుంది. ఇక్కడి నుంచే సరస్వతి నిలయమైన కొలనుభారతికి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

● శ్రీశైలం సమీపంలోని ఇష్టకామేశ్వరి ఆలయం, శివాజీ స్ఫూర్తి కేంద్రం, పాలధార, పంచధార ప్రదేశాల్లో ఒకచోట ట్రెక్కింగ్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

● శ్రీశైలంలో మరో రోప్‌వే ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్- తెలంగాణ రాష్ట్రాల మధ్య సంప్రదింపులు జరుగుతున్నాయి. రుద్ర పార్కు నుంచి దోమలపెంట, ఈగలపెంట వరకు రోప్‌వే ఏర్పాటుకు అటు అటవీ శాఖ అధికారులతో చర్చిస్తున్నారు. ఇక్కడ పార్కింగ్, వసతికి రెండెకరాలు సేకరించాలని నిర్ణయించారు.

నవాబు ఖిల్లా.. ఇక కళకళ

★ బనగానపల్లి సమీపంలోని నవాబుల కోటను సుందరంగా తీర్చిదిద్ది ఇక్కడ సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేయనున్నారు.

★ బెలుం గుహలతో పాటు యాగంటి క్షేత్రానికి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. ఈ రెండింటి మార్గంలో ఉన్న నవాబుల కోటను అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన కూటమి ప్రభుత్వం ముందుంది.

వాల్మీకి గుహలకు మార్గం

ప్యాపిలి సమీపంలో వాల్మీకి గుహలు, బేతంచెర్లలో బిల్వ గుహలు చూసేందుకు వెళ్లే పర్యాటలకు సంఖ్య పెరిగింది. ఇప్పటికే ఈ గుహలతో పాటు మద్దిలేటి స్వామి క్షేత్రాన్ని సందర్శించే విధంగా ప్రత్యేకంగా రవాణా సౌకర్యాలను కల్పించారు. సెలవు దినాల్లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఆధ్యాత్మిక క్షేత్రాలతో పాటు పర్యాటక ప్రాంతాలను ఎక్కువ మంది సందర్శించే విధంగా ఈ మార్గంలో మరిన్ని ఆర్టీసీ బస్సులు తిప్పాలని భావిస్తున్నారు.

188 మద్యం దుకాణాలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నూతన మద్యం విధానాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. ఇప్పటికే సెబ్‌ను రద్దు చేసి ఆబ్కారీ శాఖలో కలిపేసింది.. ఉద్యోగులను సర్దుబాటు చేశారు.. బదిలీల ప్రక్రియను ముగించారు.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 188 మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రకటన జారీ చేసేందుకు దస్త్రం సిద్ధం చేశారు. కర్నూలు జిల్లాలో 90 దుకాణాలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది.. మరో 9 దుకాణాలు పెరిగే అవకాశముంది. దీనిపై శుక్రవారానికి స్పష్టత వచ్చే అవకాశముంది. అక్రమ మద్యం రవాణాకు అవకాశం లేకుండా అన్ని మండలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. నూతన మద్యం విధానానికి సంబంధించి మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, పర్యవేక్షణాధికారులు సన్నద్ధమవుతున్నారు.



ఎక్సైజ్ స్టేషన్లు	మద్యం దుకాణాలు
కర్నూలు	29
కోడుమూరు	14
ఎమ్మిగనూరు	14
ఆదోని	13
కోసిగి	1
ఆలూరు	6
పత్తికొండ	13

■ త్వరలో టెండర్లు పిలుపు

దక్కించుకోవడానికి పావులు

మద్యం దుకాణాలు దక్కించుకోవడానికి రాజకీయ నాయకులు.. ఇటు వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. ఎలాగైనా దుకాణాలు హస్తగతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. గతంలో కర్నూలు, డోన్, ఎమ్మిగనూరు, ఆదోని ప్రాంతాల్లో సిండికేట్ హవా కొనసాగింది. రాజకీయ నాయకులే తెరవెనుక ఉండి సిండికేట్లను నడిపించారు. అనుమతులు ఎవరు దక్కించుకున్నా దౌర్జన్యంగా వారే దుకాణాలు, బార్లు నిర్వహించేవారు. ఎమ్మార్పీ కంటే కంటే అధిక ధరలకు విక్రయించటం.. ఇతరత్రా అక్రమాలకు పాల్పడేవారు. పోలీసు, ఆబ్కారీ శాఖల అధికారులకు మామూళ్లు ముట్టజెబుతూ ఓ మాఫియాలా సిండికేట్ పెద్దలు మద్యం వ్యాపారం నడిపించారు. ఎమ్మిగనూరులో మాజీ ఎమ్మెల్యే కనుసన్నల్లో నడిచేది. ఆదోని.. ఇతరత్రా ప్రాంతాల్లో గతంలో అధికార పార్టీ నేతలే పెత్తనం చెలాయించి ప్రతి నెలా మామూళ్లు వసూలు చేసేవారు. ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పలుమార్లు అనిశా విచారణకు హాజరయ్యారు. ఆబ్కారీ, పోలీసు శాఖ అధికారులపై సస్పెన్షన్ వేటు వేశారు



ఆదోనిలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

సంస్కృతీ సంప్రదాయాలను మంటగలిపిన వైకాపా

■ తిరుపతి లడ్డూ కల్తీ క్షమించరాని నేరం

■ తెదేపా జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుమలలో సంస్కృతి, సంప్రదాయాలను గత వైకాపా ప్రభుత్వం మంటగలిపింది.. వేంకన్న లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసి క్షమించరాని నేరం చేశారని తెదేపా కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. ఆదోని పట్టణం వైఎంకే పాఠశాల ఆవరణలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి, తెదేపా ఆదోని బాధ్యుడు మీనాక్షినాయుడు, మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ జైన్, జనసేన బాధ్యుడు మల్లప్ప, భాజపా జిల్లా అధ్యక్షుడు నీలకంఠ, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ, తెదేపా సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, భూపాల్ చౌదరి తదితరులు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా కేక్ కోశారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ.. కూటమిలో చిన్న చిన్న సమస్యలు వస్తుంటాయి.. అవి పరిష్కారం అవుతాయన్నారు. ఆదోని డివిజన్‌లో మీనాక్షి నాయుడు కుటుంబం తెదేపాకు మూలస్తంభం అన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి గెలుపు కోసం నిరంతరం శ్రమించారన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. ఆదోని అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఆదోని తెదేపా బాధ్యుడు మీనాక్షినాయుడు మాట్లాడుతూ.. తెదేపా ప్రభుత్వం వంద రోజుల్లో మంచి ప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకుందన్నారు.

ఆర్డీవోల బదిలీ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా 57 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పలాస ఆర్డీవో భరత్ నాయక్‌ను పత్తికొండ ఆర్డీవోగా, విజయనగరం జిల్లా బీసీ సంక్షేమ, దేవాదాయ శాఖ అధికారి కిడారి సందీప్ కుమార్‌ను కర్నూలు ఆర్డీవోగా నియమించారు. కర్నూలు ఆర్డీవోగా పనిచేస్తున్న శేషిరెడ్డిని జీఏడీలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పత్తికొండ ఆర్డీవో ఎన్.రామలక్ష్మిని రేపల్లె ఆర్డీవోగా నియమించింది.



జగన్నాథగట్టుపై జరుగుతున్న తవ్వకాలు

జగన్నాథ.. గట్టును మింగేస్తున్నారు

కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టును ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. పొక్లెయిన్లు పెట్టి టిప్పర్లలో రాళ్లు, మట్టి యథేచ్ఛగా తరలిస్తున్నారు. కొండపై ట్రిపుల్ ఐటీ కళాశాల ఉంది. ప్రస్తుతం సిల్వర్‌జూబ్లీ కళాశాల, క్లస్టర్ విశ్వవిద్యాలయం నిర్మాణాలు జరుగుతున్నాయి. కొండ కింది నుంచి పెద్దఎత్తున తవ్వేస్తుండటంతో పైన నిర్మిస్తున్న భవనాలకు ముప్పు కలిగే ప్రమాదముంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. – ఈనాడు, కర్నూలు

మద్దిలేటి.. అక్రమాల్లో మేటి

■ ఇష్టానుసారంగా ఎఫ్ఎంసీ జారీ

■ సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

కల్లూరు తహసీల్దారు కార్యాలయం అక్రమాలకు నిలయంగా మారింది.. గతంలో వీఆర్వోగా పని చేసిన మద్దిలేటి అన్నీ తానై నడిపించారు.. ప్రస్తుతం దేవనకొండ మండలం తెర్నేకల్-2లో డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. కల్లూరులో ధనార్జనే ధ్యేయంగా పనిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కల్లూరులో 767/2 సర్వే నంబరులో మ్యుటేషన్ పత్రాలు లేకుండానే అప్‌లోడ్ చేశారు. 168 మ్యుటేషన్లకు సంబంధించిన దస్త్రాలు ఫిజికల్‌గా లేవు. అతనిపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ప్రాథమిక విచారణ నివేదిక ఆధారంగా సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి. రంజిత్ బాషా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మద్దిలేటి అక్రమాల బాగోతాలు ఒక్కోటి వెలుగులోకి వస్తున్నాయి. అతని తీరుతో ఓ అధికారి తల్లి రోడ్డున పడింది.

కర్నూలు నిఘా విభాగం, న్యూస్‌టుడే :

రోడ్డున పడిన ఓ అధికారి తల్లి

జిల్లా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఓ ఉప తహసీల్దారు ఈ ఏడాది జులై 9న మృతి చెందారు. ఆయన కుటుంబం కల్లూరు అర్బన్ పరిధిలో నివాసముంటోంది. ఆ అధికారి కుటుంబంలో తల్లి, చెల్లెలు, భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సదరు అధికారి కుటుంబం కల్లూరు తహసీల్దారు కార్యాలయంలో కుటుంబ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీఆర్వో కె.మద్దిలేటి సమగ్రంగా విచారించకుండానే.. రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకుడి ఆదేశాలమేరకు తప్పుడు వివరాలతో పత్రం జారీ చేయించారు. వీఆర్వో ఇచ్చిన నివేదిక తప్పుగా ఉందంటూ ఆర్ఐ తిరస్కరించారు. అయినప్పటికీ సదరు వీఆర్వో, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేత ప్రోద్బలంతో తహసీల్దారు పత్రం ఇచ్చారు. చనిపోయిన సదరు అధికారికి తల్లి, చెల్లెలు ఉన్నారు. వారి పేర్లతో సహా కుటుంబ పత్రం ఇవ్వాల్సి ఉండగా.. వారి పేర్లు ఉద్దేశపూర్వకంగా చేర్చలేదన్న ఆరోపణలున్నాయి. తనకు అన్యాయం జరిగిందంటూ సదరు అధికారి తల్లి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

టెట్ అభ్యర్థులకు కేంద్రాల కేటాయింపు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు 54,083 మంది దరఖాస్తు చేసుకున్నట్లు డీఈవో శామ్యూల్ గురువారం తెలిపారు. హైదరాబాదులో కర్మన్‌ఘాట్, ఎల్‌బీ నగర్‌లో ఉన్న అయాన్ డిజిటల్‌లో 13,423 మంది, ఆదోని భీమా ఇన్‌స్టిట్యూట్‌లో 3,100, నగరంలో ఉన్న బృందావన్ ఇన్‌స్టిట్యూట్‌లో 1,668, సనత్ నగర్‌లో ఉన్న అయాన్ డిజిటల్‌లో 20,265, దూపాడులో ఉన్న అయాన్ డిజిటల్‌లో 7,410, ఎమ్మిగనూరులో ఉన్న సెయింట్ జోసెఫ్ ఇంజినీరింగ్ కాలేజీలో 900 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తారన్నారు. అక్టోబరు 3 నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రానికి రెండు గంటల ముందే చేరుకోవాలని సూచించారు.

తోడబుట్టారు.. పతకాలు చేపట్టారు

☛ మార్షల్ ఆటలో రాణిస్తున్న అక్కాతమ్ముడు

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: పిల్లల ఆసక్తిని గమనించి.. తల్లి దండ్రులు ప్రోత్సహించారు. సద్విని ఆటపై పట్టు సాధించి.. పతకాలు సాధిస్తున్నారు ఆ అక్కాతమ్ముడు.



వినయశ్రీ, దేవాన్ష్

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలంటే కఠోర సాధన తప్పనిసరి. రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని తమ పంచ్‌లతో పతకాలు ఒడిసిపడుతున్నారు. ఆదోని పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ వెంకటరమణ దంపతుల కుమార్తె ఎన్.వినయశ్రీ, కుమారుడు ఎన్.దేవాన్ష్ మార్షల్ ఆర్ట్స్ పుంసే క్రీడలో ప్రతిభ చాటుతున్నారు. వినయశ్రీ ఎనిమిది, దేవాన్ష్ ఏడో తరగతి చదువుతున్నారు. ఓ వైపు చదువుతూనే మరో వైపు ఆదోని పట్టణానికి చెందిన మాస్టర్ దాదాబాషా వద్ద మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్నారు. మునేళ్లుగా పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు.

ప్రతిభకు బంగారు పతకం

అక్కాతమ్ముడు వినయశ్రీ, దేవాన్ష్ మార్షల్ ఆర్ట్స్ క్రీడల్లో రాణిస్తూ.. బ్లాక్ బెల్ట్ సొంతం చేసుకున్నారు. ఈ నెల 15వ తేదీన కడపలో మార్షల్ ఆర్ట్స్ పుంసే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఇద్దరూ బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. గత నెల తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు విభాగాల్లో వినయశ్రీ బంగారు, వెండి పతకాలు సాధించగా.. దేవాన్ష్ రెండు బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. ఇప్పటి వరకు పదుల సంఖ్యలో పతకాలు సాధించి శభాష్ అనిపించుకుంటున్నారు. చదువులోనూ ఉన్నత స్థాయికి ఎదగడమే తమ లక్ష్యమని చెబుతున్నారు ఈ ఇద్దరు అక్కా తమ్ముడు.


వైకాపా పాపం.. రాతి వనాలకు శాపం

ఓర్వకల్లు సమీపంలో ఉన్న రాక్ గార్డెన్ (రాతి వనాలు)ను గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. అప్పట్లో దీని ప్రాధాన్యాన్ని గుర్తించిన తెదేపా ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించింది. పర్యాటకులను ఆకట్టుకునేలా పలు సౌకర్యాలు కల్పించింది. హరిత రెస్టారెంట్లు ఏర్పాటుచేసింది. ఫలితంగా ప్రతిరోజూ వందల సంఖ్యలో జనం వచ్చేవారు. పర్యాటక శాఖకు ఆదాయం సమకూరేది. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో రాతి వనం అధ్వాన స్థితికి చేరింది. ఆ ప్రాంతంలో ఏర్పాటుచేసిన ఆట వస్తువులు శిథిలావస్థకు చేరాయి. నీటి ఫౌంటెన్ అధ్వాన స్థితికి చేరింది. పర్యాటకుల సంఖ్య సైతం పడిపోయింది.


- ఈనాడు, కర్నూలు



బురదమయంగా రహదారి



అధ్వాన స్థితికి చేరిన హరిత రెస్టారెంట్



నీటి ఫౌంటెన్‌లో మురుగునీరు



పిల్లల పార్కులో శిథిలావస్థకు చేరిన ఆట వస్తువులు



రాతి వనాల మధ్య వసతిగృహాలు

అబ్కారీ శాఖ డీసీ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ రంజిత్‌బాషాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లా మద్య నిషేధ, అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా పి.శ్రీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, పర్యవేక్షణాధికారి సుధీర్‌బాబు, సీఐలు, ఎస్సైలు స్వాగతం పలికారు. అనంతరం ఆమె కలెక్టర్ రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో జిల్లాలో అమలు చేయనున్న నూతన మద్యం పాలసీపై చర్చించినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లా మద్య నిషేధ, అబ్కారీ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్‌గా హనుమంతరావు నగరంలోని కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు వైద్యాలయం : పారా మెడికల్ కోర్సుల్లో భాగంగా వివిధ కేటగిరీల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకుగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టినరసమ్మ గురువారం తెలిపారు. అర్హులైనవారు రూ.100 చెల్లించి అక్టోబరు 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సహాయ పర్యవేక్షణాధికారుల నియామకం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లా మద్య నిషేధ, అబ్కారీ శాఖలో రెండో విడతగా సహాయ పర్యవేక్షణాధికారులను నియమిస్తూ ఆ శాఖ డైరెక్టర్ నిశాంత కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా పర్యవేక్షణాధికారి కార్యాలయానికి సహాయ పర్యవేక్షణాధికారిగా వి.రాముడు నియమితులయ్యారు. సహాయ పర్యవేక్షణాధికారి రాజశేఖర్‌గౌడ్‌ను కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయానికి, సహాయ పర్యవేక్షణాధికారి రామకృష్ణారెడ్డిని కర్నూలు పర్యవేక్షణాధికారి కార్యాలయానికి నియమించారు. కర్నూలు ఐఎంఎల్ డిపో మేనేజరుగా వి.శ్రీధర్‌రావుకు బాధ్యతలు అప్పగించారు.

ఉమ్మడి పరీక్షల విభాగం,
జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, కర్నూలు జిల్లా.

షార్ట్ టెండర్ ప్రకటన

కర్నూలు జిల్లా ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలల్లో 2024-2025 విద్యా సంవత్సరమునకు 1 నుండి 10వ తరగతి వరకు పరీక్షలను నిర్వహించుటకు తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ, కన్నడ మీడియంలలో ప్రశ్నాపత్రములను సబ్జెక్టు వారీగా, తరగతుల వారీగా ముద్రించి, పాఠశాలల వారీగా ప్యాకింగ్ చేసి, ప్యాకింగ్ చేసిన బండిళ్లను జిల్లాలోని అన్ని స్కూల్ కాంప్లెక్స్‌లకు సరఫరా చేయుటకు ట్రాన్స్‌పోర్ట్ మరియు GSTతో పేజీ రేటుతో సహా టెండరు దాఖలు చేయుటకు ప్రకటన జారీ చేయడమైనది. OMR Sheets ముద్రణ మరియు OMR Sheets జవాబు పత్రములను స్కానింగ్ చేయుటకు కూడా టెండర్లను ఆహ్వానించడమైనది. టెండర్లలో పాల్గొనదలచిన వారు దరఖాస్తు ఒక్కింటికి రూ. 500/- ధరావత్తును కార్యదర్శి జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం, కర్నూలు పేరున 01-10-2024లోపు D.D తీసి కార్యదర్శి, DCEB కర్నూలుకు సమర్పించి దరఖాస్తు ఫారంలను పొందవలయును. మరిన్ని వివరముల కొరకు కార్యదర్శి జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం, కర్నూలు జిల్లా వారిని సంప్రదించగలరు.

సం/- జిల్లా విద్యాశాఖాధికారి & ఛైర్మన్, ఉమ్మడి పరీక్షల విభాగం, కర్నూలు.

పబ్లిక్ నోటీసు

మేము ఇక్కడ వ్రాసిన ("షెడ్యూల్ ప్రాపర్టీస్") షెడ్యూల్‌లో మరింత ప్రత్యేకంగా వివరించిన భూమి యజమానుల శీర్షికను పరిశీలిస్తున్నాము. విక్రయం, బదిలీ, మార్పిడి, అసైన్‌మెంట్, విల్, విడుదల, ఉపసంహరణ, డిక్రీ లేదా ఆర్డర్ ద్వారా షెడ్యూల్ ప్రాపర్టీస్‌లో లేదా దానిలోని ఏదైనా భాగంలో ఏదైనా వ్యక్తి హక్కు, టైటిల్, దావా, ప్రయోజనం, డిమాండ్ లేదా ఆసక్తిని కలిగి ఉంటే లేదా క్లెయిమ్ చేస్తే ఏదైనా న్యాయస్థానం, భారం, తనఖా, లీజు, తాత్కాలిక హక్కు, ఛార్జ్, నిర్వహణ, లైసెన్స్, బహుమతి, వారసత్వం, అవిభక్త వాటా, స్వాధీనం, సౌలభ్యం, ట్రస్ట్, బీక్వెస్ట్, సబ్ లీజు, అద్దె, ఉప-అద్దె, సెలవు మరియు లైసెన్స్, లిస్ పెండెన్‌లు , సౌలభ్యం, ఎంపికలు, మొదటి తిరస్కరణ హక్కు లేదా ఏదైనా స్వభావం లేదా ఇతరత్రా లేదా ఎలాగైనా, లేదా ఏదైనా ఒప్పందం కింద, దస్తావేజు, పత్రం లేదా న్యాయవాది యొక్క అధికారం లేదా ఏదైనా అభ్యంతరం/లు ఏ పద్ధతిలో అయినా తెలియజేయడం అవసరం దానికి మద్దతుగా డాక్యుమెంటరీ రుజువు యొక్క నోటరీ చేయబడిన/ధృవీకరించబడిన నిజమైన కాపీలతో వ్రాతపూర్వకంగా, ఈ నోటీసు తేదీ నుండి 10 (పది) రోజులలోపు క్రింద సంతకం చేసిన వారి క్రింద పేర్కొన్న చిరునామాలో దిగువ సంతకం చేసిన వారికి, విఫలమైతే అది టైటిల్ యొక్క శీర్షిక అని భావించబడుతుంది. షెడ్యూల్ ప్రాపర్టీలు స్పష్టంగా, చెల్లుబాటు అయ్యేవి మరియు విక్రయించదగినవి మరియు షెడ్యూల్ ప్రాపర్టీలపై ఎవరికీ ఎలాంటి హక్కులు, టైటిల్, ఆసక్తి, దావా, డిమాండ్ ఉండవు. సపోర్టింగ్ డాక్యుమెంట్లు లేని ఏవైనా క్లెయిమ్‌లు స్వీకరించబడవు. దయచేసి మీ ఎన్వలప్‌ను ఆంధ్రప్రదేశ్, నంద్యాల & కర్నూలు అనే సూపర్‌స్క్రిప్షన్‌తో గుర్తు పెట్టుకోండి.

షెడ్యూల్ ప్రాపర్టీలు (భూమి యొక్క వివరణ)

దాదాపు 127.61 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్థిరాస్తి మొత్తం ముక్క మరియు పార్శిల్కొలుములపల్లి, సర్పరాజపురం, రంగాపురం, గుటుపల్లి, కొలుములపల్లె, కొత్తపల్లి గ్రామాలు, బేతంచెర్ల మరియు వెల్దుర్తిమండలం, నంద్యాల మరియు కర్నూలు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ మరియు మరింత ప్రత్యేకంగా క్రింద వివరించబడింది:

స. నెం	సర్వే నెం.	గ్రామం / మండలం / జిల్లా	యజమాని పేరు	మొత్తం పరిధి (ఎకరాలు)
1	561	కొలుములపల్లి / బేతంచెర్ల/నంద్యాల	కనాల బ్రహేశ్వర రెడ్డి	2
2	309	సర్పరాజపురం / వెల్దుర్తి / కర్నూలు	పి గోవిందు	4.82
			లక్ష్మి దేవి	0.62
			కె కనకగిరి ఆచారి	6.43
			కె వీరభద్ర ఆచారి	3.35
			కె శ్రీనివాస ఆచారి	3.04
3	291	సర్పరాజపురం / వెల్దుర్తి / కర్నూలు	టి.మద్దిలేటి	1.75
			వై.గోవిందు	2.63
			వై.మద్దయ్య	1.04
			వై.ముగెన్న	1.02
			వై.పుల్లన్న	6.18
			వై.రాజు	1.04
			వై.సాలన్న	1.71
4	49-A3	రంగాపురం / బేతంచెర్ల / నంద్యాల	తెలుగు జయరాముడు	1.95
5	868	గుటుపల్లి / బేతంచెర్ల / నంద్యాల	ధోనే చిన్నయ్య	8
6	821	గుటుపల్లి / బేతంచెర్ల / నంద్యాల	జె వెంకటేశ్వర్లు	3.63
			జె మద్దిలేటి	3.04
7	669	గుటుపల్లి / బేతంచెర్ల / నంద్యాల	యు శేఖర్	3.22
			యు శ్రీరాములు	6.72
			యు. నాగయ్య	4.86
8	42-A	రంగాపురం / బేతంచెర్ల / నంద్యాల	కె చిన్నా ఓబులేసు	2.52
			కె చిన్న యల్లయ్య	3.23
			కె పరశురాముడు	1.75
			కె రామాంజనేయులు	1.5
			కె నాగ మద్దమ్మ	4.56
9	509	నరసాపురం / వెల్దుర్తి / కర్నూలు	ఎన్ తెలుగు వెంకటయ్య	1.37
			ఎన్ పెద్దరాజు	1.37
			ఎస్ రామాంజనేయులు	5.12
			బాల రంగడు	1.05
			నగేష్	0.8
10	183	రంగాపురం / బేతంచెర్ల / నంద్యాల	కె.రాధమ్మ	4.49
11	183	రంగాపురం / బేతంచెర్ల / నంద్యాల	జి.సాలన్న	3.87
12	183	రంగాపురం / బేతంచెర్ల / నంద్యాల	ఎం.నాగలక్ష్మమ్మ	4.75
13	7	రంగాపురం / బేతంచెర్ల / నంద్యాల	బి.లక్ష్మీదేవి	3.24
14	7	రంగాపురం / బేతంచెర్ల / నంద్యాల	బి.మాధవి	3.24
15	568-1C1	కొలుములపల్లె/బేతంచెర్ల /నంద్యాల	యు.రాముడు	4
			యు లక్ష్మి రెడ్డి	4
16	577	కొత్తపల్లి / బేతంచెర్ల / నంద్యాల	బి శ్రవణ్ కుమార్	2.2
17	576	కొత్తపల్లి / బేతంచెర్ల / నంద్యాల	లోడుగు చిన్నరామ	2
			వక్కం సోమన్న	5.5

సం/- శ్రీ పి. జ్యోతి బసు, B.A. LL.B, న్యాయవాది, 12-2-121, అలేఖ్య ఫంక్షన్ హాల్ దగ్గర, అశోక్ నగర్, అనంతపురము, మొబైల్ నెం: 9440209616, Email: basuu1971@gmail.com

ఎట్టకేలకు జాబితా ఖరారు

☛ 42 మంది ఎంపీడీవోలకు స్థానచలనం
☛ పంతం నెగ్గించుకున్న జడ్పీ సీఈవో

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : ఎట్టకేలకు ఎంపీడీవోల బదిలీల జాబితా ఖరారైంది. రెండు రోజుల కిందట జడ్పీ ఛైర్మన్, సీఈవో వేర్వేరుగా బదిలీల జాబితా విడుదల చేయడం వివాదాస్పదమైంది. అసలేం జరుగుతోందో ఎవరికీ అర్థం కాని పరిస్థితి. ఈ నేపథ్యంలో తాజాగా 42 మంది ఎంపీడీవోలను బదిలీ చేస్తూ సీఈవో నాసరరెడ్డి గురువారం జాబితా విడుదల చేశారు. గతంలో వైకాపా నేతలకు అండగా ఉన్న కొందరు ఎంపీడీవోలకు అనుకున్న స్థానాలు లభించగా. . ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు ఇచ్చినా ఫలితం దక్కలేదని మరికొందరు ఆవేదన చెందుతున్నారు.

ఎడమొహం.. పెడమొహం


బదిలీల్లో నెలకొన్న విభేదాల నేపథ్యంలో జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి, సీఈవో నాసరరెడ్డి గత మూడు రోజులుగా ఎడమొహం పెడమొహంగా ఉన్నారు. నగరంలోని జడ్పీ కార్యాలయానికి ఛైర్మన్ పాపిరెడ్డి గురువారం మధ్యాహ్నం వచ్చారు. కాగా బదిలీలకు సంబంధించిన అంశంపై ఛైర్మన్‌ను సీఈవో సంప్రదించకపోవడంతో వీరిద్దరి మధ్య అంతరం మరింత పెరిగిందని జడ్పీ కార్యాలయ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

● ఉమ్మడి జిల్లాలో 42 మంది ఎంపీడీవోలను బదిలీ చేస్తూ జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి 23వ తేదీ రాత్రి విడుదల చేసిన జాబితాను గురువారం మరోసారి అధికారికంగా ధ్రువీకరించారు. బదిలీ ఉత్తర్వులను వచ్చే నెల 1న ఇస్తామని.. వీరందరూ 2వ తేదీన విధుల నుంచి రిలీవ్ కావాల్సి ఉంటుందని సీఈవో నాసరరెడ్డి చెప్పారు. ఇదే తుది జాబితా అని స్పష్టం చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ ప్రదేశం
ఆర్.గీతావాణి	ఆదోని	ఆస్పరి
అల్లాబకాష్	ఆలూరు	చిప్పగిరి
ఎం.రాణెమ్మ	ఆస్పరి	సి.బెళగల్
జి.మోహన్‌కుమార్	ఆత్మకూరు	కృష్ణగిరి
ఎ.సి.రాముడు	సి.బెళగల్	కోడుమూరు
సి.వి.కొండయ్య	చాగలమర్రి	మద్దికెర
ఎం.శ్రీనివాసులు	డోన్	ఓర్వకల్లు
అమానుల్లా	వెలుగోడు	ఆలూరు
ఎం.మణిమంజరి	మంత్రాలయం	గోనెగండ్ల
పి.సుమిత్రమ్మ	అనంతపురం జిల్లా	మంత్రాలయం
వరలక్ష్మి	”	హాలహర్వి
వై.పుల్లయ్య	”	నందవరం
పి.విజయలలిత	”	హొళగుంద
జి.రఘునాథ్	”	కర్నూలు గ్రామీణ
సుహాసినమ్మ	హొళగుంద	వెల్దుర్తి
రాజేంద్రప్రసాద్	కోసిగి	ఆదోని
విశ్వమోహన్	కృష్ణగిరి	తుగ్గలి
జి.నాగశేషచలారెడ్డి	మిడుతూరు	కల్లూరు
శోభారాణి	నందికొట్కూరు	పత్తికొండ
శివనాగప్రసాద్	ఓర్వకల్లు	గూడూరు

మతసామరస్యం.. ఎల్లార్తి దర్గా రహస్యం..!

హాలహర్వి, హొళగుంద, న్యూస్‌టుడే : జిల్లాలో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఎల్లార్తి షేక్షావలి, షాషావలి సాహెబ్‌ల ఉరుసు ఉత్సవాలు ఈ నెల 29న ప్రారంభం అవుతున్నాయి. దీంతో ముందుగానే దర్గాలను ముస్తాబు చేస్తున్నారు. గంధంతో మొదటి రోజు ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. ఈ ఉరుసులో పాల్గొనడానికి తెలుగు రాష్ట్రాలతో పాటుగా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఏటా ఎంతో విశిష్టంగా నిర్వహించే ఉరుసుపై ప్రత్యేక కథనం



షేక్షావలి సాహెబ్ దర్గా ముఖద్వారం

దర్గాల చరిత్ర..

సుమారు 400 ఏళ్ల క్రితం అరబ్ దేశానికి చెందిన షేక్షావలి, షాషావలి సాహెబ్‌లు యూనాని వైద్యంలో సేవలందించడానికి భారత్‌లోని గుల్బర్గాకు వచ్చినట్లు భక్తుల నమ్మకం. అక్కడి నుంచి వైద్యం చేస్తూ ఎల్లార్తి గ్రామానికి చేరుకున్నట్లు పెద్దలు చెబుతారు. తమ మహిమలతో దీర్ఘకాల రోగాలను సైతం నయం చేస్తూ భక్తుల్లో ఎనలేని విశ్వాసాన్ని పొందారు. సాహెబ్‌ల వైద్యం, సందేశాలతో ప్రభావితులైన భక్తులు షేక్షావలి, పాషావలి, సాహెబ్‌ల దర్గాలను నిర్మించారు. ఈ దర్గాలకు ప్రతి గురు, శుక్రవారాలతో పాటు అమావాస్య రోజు భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారు. కన్నడ భాషలో 'ఎల్లా' అంటే అందరూ అని, 'ఆర్తి' అంటే బాధలో ఉన్న వారు (ఆర్థులు) అని అర్థం. క్రమేణా ఇదే గ్రామ నామంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఉరుసు జరిగే తేదీలివే..

- సెప్టెంబరు 29 (ఆదివారం) గంధం
- సెప్టెంబరు 30 (సోమవారం) ఉరుసు
- అక్టోబరు 1 (మంగళవారం) జియారత్ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి.

గంధం ఇలా జరుగుతుంది..

వేలాది మంది భక్తుల మధ్య ఆదివారం రాత్రి సాహెబ్‌ల గంధాన్ని ఊరేగింపుగా దర్గాలకు తీసుకొస్తారు. దర్గాలకు చేరుకున్న గంధాన్ని ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు అందజేస్తారు. ఈ కార్యక్రమం వక్ఫ్ బోర్డు అధికారులు, స్థానిక భక్తుల పర్యవేక్షణలో జరుగుతుంది.

ఇలా చేరుకోవచ్చు

జిల్లా కేంద్రానికి సుమారు 130 కి.మీ., హొళగుంద నుంచి 9 కి.మీ., ఆలూరు నుంచి 17 కి.మీ. దూరంలో ఎల్లార్తి గ్రామం ఉంటుంది. హొళగుంద మార్గం నుంచి కర్ణాటక, ఆదోని ప్రాంతాల భక్తులు చేరుకోవచ్చు. ఆలూరు మార్గంలో కోడుమూరు, పత్తికొండ, గుంతకల్, అనంతపూర్ ప్రాంతాల నుంచి భక్తులు రావచ్చు. ఆదోని, పత్తికొండ, బనగానపల్లె తదితర ఆర్టీసీ డిపోల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయి. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, శిరుగుప్ప ప్రాంతాల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దర్గాలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో ఇమ్రాన్ తెలిపారు. వేలాది భక్తులు రానుండటంతో గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఎల్లార్తి గ్రామ సర్పంచు చాముండేశ్వరి వెల్లడించారు.

జలవనరుల శాఖలో కదిలిన పీఠాలు

☛ రెడ్డి శేఖర్‌రెడ్డి అనంతపురానికి బదిలీ ☛ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: జలవనరులశాఖలో ఈఈల బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

● కేసీ కాల్వ ఈఈగా ప్రతాప్‌ను నియమించారు. ఆయన అనంతపురం జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు.

● కర్నూలు సర్కిల్ కార్యాలయం డిప్యూటీ ఎస్ఈగా వైఎస్సార్ జిల్లాలో పని చేస్తున్న బాలచంద్రారెడ్డిని నియమించారు.

● కర్నూలు ఎంఐ ఈఈ రెడ్డి శేఖర్‌రెడ్డిని అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. ఈయన గత రెండేళ్లుగా కర్నూలు ఎస్ఈగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన స్థానంలో శ్రీశైలం డ్యాం ఈఈ జి.శ్రీనివాసులును నియమించారు.

● ఎల్లెల్సీ ఈఈగా పురుషోత్తపట్నంలో విధులు నిర్వహిస్తున్న పాండు రంగయ్యను నియమించారు. ఆయన గతంలో హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు ఈఈగా పని చేశారు.

● కర్నూలు సీఈ కార్యాలయం ఉప సీఈ లక్ష్మానాయక్‌ను శ్రీశైలం ప్రాజెక్టు డిప్యూటీ ఎస్ఈగా నియమించారు. విజయవాడకు చెందిన మల్లికార్జునను శ్రీశైలం ప్రాజెక్టుకు బదిలీ చేశారు.

● ఎస్సార్బీసీ సర్కిల్-1లో పని చేస్తున్న రాజేంద్రప్రసాద్‌ను కర్నూలు డిప్యూటీ సీఈగా నియమించారు.

● నంద్యాల ఎస్సార్బీసీ-2 డివిజన్ ఈఈ ఎల్ఎన్ వరప్రసాద్‌ను అదే సర్కిల్‌లో డిప్యూటీ ఎస్ఈగా నియమించారు.

డీఈఈ, ఏఈఈల బదిలీ

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: జల వనరులశాఖలో డీఈఈ, ఏఈఈలను బదిలీ చేస్తూ ఆ శాఖ ఈఎన్‌సీ కె.శ్రీనివాస్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 11 మంది డీఈఈలు, 40 మందికిపైగా ఏఈఈలకు బదిలీల ప్రక్రియ జరిగింది. నేతల సిఫార్సులతో కొందరు ఇంజినీర్లు జిల్లా కేంద్రంలోని తిష్ట వేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. గత ఐదేళ్లుగా కేసీ కాల్వ, కర్నూలు సబ్ డివిజన్‌లో పని చేసిన ఏఈఈలకు తిరిగి ఇక్కడే క్వాలిటీ కంట్రోలులో పని చేసేందుకు చేసిన పైరవీలు ఫలించాయి. కీలకమైన కర్నూలు ఎంఐ, కేసీ కాల్వ సబ్ డివిజన్‌లకు డీఈఈల నియామకం జరగలేదు. ఏఈలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తారా.. లేక కొత్త వారికి అవకాశం కల్పిస్తారా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

రూ.3 కోట్లకు వ్యాపారి టోకరా

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : పట్టణంలో ఓ లేడిస్ కార్నర్ వ్యాపారి రూ.3 కోట్లకు టోకరా వేసినట్లు విశ్వసనీయ సమాచారం. లేడిస్ కార్నర్ దుకాణాన్ని నిర్వహిస్తూ తెలిసిన వారి నుంచి పెద్దఎత్తున అప్పులు తీసుకున్నాడు. అప్పులు పెరిగిపోవడంతో వారం రోజుల క్రితం ఎవరికి చెప్పకుండా దుకాణానికి తాళం వేసి ఉడాయించారు. దీంతో అప్పులిచ్చిన వాళ్లు ఎవరికి చెప్పాలో తెలియక లబోదిబోమంటున్నారు.

ఎమ్మిగనూరు ఆసుపత్రి సూపరింటెండెంట్ మైత్రేయి సస్పెన్షన్

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మైత్రేయిపై పలు ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆమె స్థానంలో చిన్నపిల్లల వైద్యురాలు సుధ అయ్యగారిని నియమించారు. మైత్రేయి నిర్లక్ష్యంగా కారణంగా నవజాత శిశువు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆందోళన చేయడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో కొన్నేళ్లుగా ఉన్న గుజిరి (ఇనుప సామగ్రి)ని నిబంధనలకు విరుద్ధంగా గుట్టుగా విక్రయించడం వివాదాస్పదమైంది. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులకు ప్రాధాన్యం ఇవ్వకుండా తాను నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌పై ఎక్కువగా దృష్టి పెట్టడంపై ఫిర్యాదులు వచ్చాయి. అదే ఆసుపత్రిలో చిన్న పిల్లల వైద్యునిగా పని చేస్తున్న మైత్రేయి భర్త చరణ్‌కు ఇతర వైద్యుల్లా డ్యూటీలు వేయకపోవడంతో ఇతర వైద్యులు సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే కొద్ది రోజులుగా సెలవుపై వెళ్లి సస్పెండ్ కాకుండా రాజకీయంగా ఒత్తిడి చేసినట్లు సమాచారం.

వైద్యుడి నిర్లక్ష్యం.. వైద్య విద్యార్థి ప్రాణం తీసింది


కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: వైద్యుల నిర్లక్ష్యం.. వైద్య విద్యార్థి ప్రాణాన్ని బలితీసుకుంది. కడుపునొప్పితో ఆసుపత్రిలో చేర్పించిన కొడుకు శవంగా తిరిగిరావడం ఆ కుటుంబాన్ని కడుపు కోతకు గురిచేసింది. తన కొడుకును తెచ్చివ్వండంటూ మృతుడి తల్లి రోదించడం అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం..కర్నూల్ జిల్లా చిప్పగిరి మండలం ఏరూరు గ్రామానికి చెందిన రవి, ప్రశాంతి దంపతులు 25ఏళ్ల క్రితం నగరానికి వచ్చి కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌లో స్థిరపడ్డారు. వీరికి ఒక కుమారుడు పి.వరుణ్‌తేజ్(23), ఒక కూతురు ఉన్నారు. వరుణ్‌తేజ్ కామినేని వైద్య కళాశాలలో మెడిసిన్ మూడో ఏడాది చదువుతున్నాడు. ఈ నెల 24న కడుపు నొప్పి రావడంతో కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నంబర్-1లోని హోలిస్టిక్ ఆసుపత్రిలో చేర్పించారు. అపెండిక్స్ కావడంతో శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు చెప్పగా తల్లిదండ్రులు అంగీకరించారు. 25వ తేదీన శస్త్ర చికిత్స జరిగిందని వైద్యులు చెప్పగా కొడుకును చూసేందుకు తల్లిదండ్రులకు ఆసుపత్రి వర్గాలు అంగీకారం ఇవ్వలేదు. గురువారం ఉదయం నుంచి అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తుండడంతో తల్లిదండ్రులు అనుమానంతో వైద్యులను నిలదీయగా వరుణ్‌తేజ్ ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పడంతో కన్నీరుమున్నీరయ్యారు. బంధువులు, తల్లిదండ్రులు ఆందోళనకు దిగినప్పటికీ ఆసుపత్రి వర్గాలు సమాధానం ఇవ్వకపోవడంతో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

శస్త్రచికిత్స చేస్తుండగా నరం తెగింది: సుబ్బారావు, సీఈవో, హోలిస్టిక్ ఆసుపత్రి

కడుపునొప్పితో వచ్చిన వరుణ్‌తేజ్‌కు శస్త్రచికిత్స చేస్తుండగా రక్త ప్రసారం జరిగే నరం తెగింది. తర్వాత పలు రకాల వైద్య సంబంధ ఇబ్బందులు తలెత్తడంతో చనిపోయాడు.

బాధితులకు న్యాయం జరగాలి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: బాధితులకు న్యాయం జరిగేలా పని చేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఆదేశించారు. కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా నేర సమీక్షా సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ.. దోపిడీ, దొంగతనాలు, మోసం, ఆర్థిక నేరాలు తదితర ఫిర్యాదులు అందిన వెంటనే కేసులు నమోదు చేయాలని సూచించారు. నిందితులను గుర్తించి సొమ్ము రికవరీ చేసి బాధితులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేరగాళ్లపై నిఘా ఉంచి గ్రామాల్లో ఘర్షణలు, గొడవలు జరగకుండా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర నేరాల నియంత్రణలో అన్ని వర్గాల వారిని సమన్వయం చేసుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ పనితీరు కనబరిచిన పలువురు అధికారులను అభినందించి ప్రశంసా పత్రాలు, రివార్డులు అందజేశారు. డీఎస్పీలు వెంకటరామయ్య, శ్రీనివాసఆచారి, సోమన్న, ఉపేంద్రబాబు, శ్రీనివాసరావు, శిక్షణ డీఎస్పీ ధీరజ్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ జి.బిందుమాధవ్

29న బాస్కెట్‌బాల్ పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: కర్నూలు డీఎస్ఏ స్టేడియంలోని బాస్కెట్‌బాల్ ఎరినాలో ఈ నెల 29న జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి భాను ప్రసాద్, సంయుక్త కార్యదర్శి మురళీకృష్ణ, దాదాబాషా గురువారం తెలిపారు. ఆసక్తి గల జట్లు వివరాల కోసం 83095 61333 చరవాణికి సంప్రదించాలని కోరారు.

ఆదోని
•ఆదోని •ఆలూరు •పత్తికొండ

ధీర వనిత చిట్యాల ఐలమ్మ

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ పోరాట సమయంలో రజాకార్లపై తిరుగబడిన ధీర వనిత చిట్యాల ఐలమ్మ అని రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీసీ రంగన్న, రజక సాధికారిత నియోజకవర్గ కన్వీనర్ హుల్తెప్ప అన్నారు. ఐలమ్మ జయంతి వేడుకల సందర్భంగా పత్తికొండ పట్టణంలోని రజక వీధిలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సి. నారాయణ, బాలరంగస్వామి, లచ్చప్ప, మల్లికార్జున, సంఘం మహిళలు పాల్గొన్నారు.

హొళగుంద, న్యూస్‌టుడే: స్థానిక మడివాళ మాచయ్య గుడి ఆవరణలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రజక నాయకులు కురుకుంద నాగరాజు, మల్లికార్జున మల్లి, లక్ష్మన్న, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల పనులు ప్రారంభించాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోనిలో అర్ధంతరంగా నిలిచిపోయిన మెడికల్ కళాశాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదోనిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు గౌస్, నాగరాజు, భరత్ కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

ఆలూరు, న్యూస్‌టుడే: **సమస్య:** ఆలూరు కోయనగర్ కాలనీలోని మినీ ట్యాంకు వద్ద మురుగు నిలిచి అపరిశుభ్రంగా మారింది. నీరు ముందుకు పారడం లేదు.
– గాదిలింగ, ఆలూరు

సమాధానం: గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి ట్యాంకు వద్ద శుభ్రం చేయిస్తాం. మురుగు నిల్వ ఉండకుండా చూస్తాం. – అరుణాదేవి, సర్పంచి, ఆలూరు

హొళగుంద, న్యూస్‌టుడే: సమస్య: హొళగుందలోని దిడ్డికాలనీకి వెళ్లే మార్గంలో శీనప్ప బావి దగ్గర ఖాళీ ప్రదేశంలో జంతువుల కళేబరాలను పడేస్తున్నారు. చెత్తాచెదారంతో దుర్వాసన వస్తోంది. – వాహిద్ బాషా, హొళగుంద

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందితో పరిసరాలు శుభ్రం చేస్తాం.
– రాజశేఖర్ గౌడ్ పంచాయతీ కార్యదర్శి, హొళగుంద

మద్దికెర, న్యూస్‌టుడే: **సమస్య:** మద్దికెరలోని బస్సు షెల్టర్ నిరుపయోగంగా మారింది. చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోయింది. నిర్వహణ లేకపోవడంతో ప్రయాణికులు అక్కడ ఉండలేకపోతున్నారు.
– వెంకటరామిరెడ్డి, మద్దికెర

సమాధానం: బస్సు షెల్టర్‌ను శుభ్రం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టేలా చూస్తాం.
– శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర

పల్లె కబుర్లు

ములుగుందం (ఆదోని నేరవార్తలు), న్యూస్‌టుడే: ఆస్పరి మండలం ములుగుందం గ్రామానికి చెందిన సిద్ధమ్మను ఆమె భర్త శివ విచక్షణా రహితంగా దాడి చేశారని బాధితురాలు, కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

చిరుమానుదొడ్డి(ఆదోని నేరవార్తలు), న్యూస్‌టుడే: ఆస్పరి మండలం చిరుమానుదొడ్డి గ్రామానికి చెందిన ఇమామ్ గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు. పనికి వెళ్లమని తల్లి మందలించడంతో మనస్థాపం చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడన్నారు. చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

సూర్యతండా(తుగ్గలి), న్యూస్‌టుడే: మండలంలోని సూర్యతండా, మిటెతండాల్లో గిరిజనుల జీవాలకు వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా రిలయన్స్ ఫౌండేషన్, అపార్డ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి శంకరమ్మ, పశువైద్యుడు పీర్‌బాషా, జీవాల యజమానులు పాల్గొన్నారు.

కొత్తూరు (తుగ్గలి), న్యూస్‌టుడే: మండలంలోని పి.కొత్తూరు, పగిడిరాయి గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు తిరుపాల్‌నాయుడు ఆధ్వర్యంలో గురువారం జరిగింది. నాయకులు ఈశ్వర్‌రెడ్డి, చక్రపాణి, రమేష్, గుండమయ్య, రంగస్వామి, రాము తదితరులు పథకాల గురించి వివరించారు.

పెరవలి(మద్దికెర), న్యూస్‌టుడే: మండలంలోని పెరవలిలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పురుషోత్తమ చౌదరి, మాజీ సర్పంచి వెంకటరామవర్మ, తెదేపా రామాంజనేయులు, పులిశేఖర్, రాము, ఎంఈవో రంగస్వామి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మదిరె(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: పోషకాహారంతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు లీలావతి అన్నారు. మదిరె గ్రామంలో ఐసీడీఎస్ వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆకు కూరలు, కూరగాయలు ప్రాధాన్యత వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలం చెల్లిన బస్సులతో కాలయాపన

☛ పత్తికొండ డిపోకు పాత బస్సులే దిక్కు ☛ పదేళ్లుగా పెరగని సర్వీసులు

డిపో:	ఆదోని
మొత్తం బస్సులు:	82
అద్దెబస్సులు:	11
సూపర్ లగ్జరి:	10
ఎక్స్‌ప్రెస్:	19
మిగతావి:	పల్లెవెలుగు బస్సులు

☛ ఆదోని హైదరాబాద్‌కు 5, బెంగళూరుకు 4, కర్నూలుకు 14, చెన్నైకి 1(వయా తిరుపతి), విద్యార్థి బస్సులు 7.

డిపో:	పత్తికొండ
మొత్తం బస్సులు:	26
అద్దెబస్సులు:	2
సూపర్ లగ్జరి:	2
ఎక్స్‌ప్రెస్:	1
మిగతావి:	పల్లెవెలుగు బస్సులు

☛ వీటిలో రెండు సూపర్ లగ్జరీ బస్సులు హైదరాబాద్‌కు నడుపుతుండగా ఒక ఎక్స్‌ప్రెస్ బస్సు కర్నూలుకు నడుస్తోంది. పల్లెవెలుగు బస్సుల్లో కర్నూలుకు 5, ఆదోనికి 3, గుంతకల్లుకు 1, ఎమ్మిగనూరుకు 3 సర్వీసులు నడుస్తుండగా వివిధ మార్గాల్లో మిగతా విద్యార్థి బస్సు సర్వీసులు తిరుగుతున్నాయి.

ఆదోని విద్య, పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని, పత్తికొండ ఆర్టీసీ డిపోల్లో కొన్నేళ్లుగా కాలం చెల్లిన బస్సులతోనే కాలయాపన చేస్తున్నారు. పెరుగుతున్న జనాభా, ప్రయాణికుల అవసరాలకనుగుణంగా బస్సు సర్వీసులు పెంచడంపై దృష్టిసారించడం లేదనే ఆరోపణలూ లేకపోలేదు. పశ్చిమ ప్రాంతాలైన పత్తికొండ, ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లోని పల్లెలకు బస్సులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పత్తికొండ ప్రాంతంలో ఆయా మార్గాల్లో సరైన ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. కర్నూలు, ఆదోని, గుంతకల్లు ప్రధాన మార్గాల్లో తప్ప ఇతర గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు ఉండవు. అడపా దడపా కొన్ని గ్రామాలకు విద్యార్థి బస్సులు తప్ప పూర్తిస్థాయిలో ప్రయాణికులను చేరవేసే లక్ష్యంతో బస్సులు నడపడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు కాలం చెల్లిన బస్సులను నడుపుతుండటంతో గమ్యం చేరుతాయో లేదోనన్న సందేహం కలుగుతోంది. ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు సర్వీసులు పెంచడమేకాకుండా పాత వాటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేస్తే కొంత మేర ప్రయాణికుల ఇబ్బందులను తొలగించవచ్చనేది నిపుణుల సూచన.


బస్సు ప్రాంగణంలో నిలిపిన బస్సులు

గేర్ పడదు.. బస్సు కదలదు

పత్తికొండ ఆర్టీసీ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు ఇది. పత్తికొండ- ఎమ్మిగనూరుకు రాకపోకలు సాగిస్తుంది. గురువారం ఎమ్మినూరు నుంచి పత్తికొండకు వెళ్తుండగా.. మార్గ మధ్యలో జూటూరు, చిన్నహుల్తి, పత్తికొండ శివారులోని హంద్రీనీవా కాల్వ సమీపంలో మూడు చోట్ల నిలిచిపోయింది. జూటూరు సమీపంలో నిలిచిపోవడంతో ప్రయాణికులను దించేసి నిదానంగా పత్తికొండ డిపోకు చేర్చేందుకు డ్రైవర్ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలం చెల్లిన బస్సులు తరచూ ఇలా చెడిపోయి ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు చెబుతున్నారు.


చిన్నహుల్తి వద్ద ఆగిపోయిన పత్తికొండ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు

సమయపాలనపై విద్యార్థుల ఆగ్రహం

ఆదోని నుంచి పత్తికొండ, దొడ్డనగేరి వైపు వెళ్లే బస్సులను పాఠశాలలు, కళాశాలలకు చేరేలా సరైన సమయానికి నడపాలని డిమాండు చేస్తూ. విద్యార్థులు గురువారం ఆందోళనకు దిగారు. పీడీఎస్‌వో ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ముందు బైఠాయించి నిరసన తెలిపారు. సరైన సమయానికి బస్సులు నడపకపోవడం వల్ల వందలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి సరైన సమయానికి బస్సులు నడపాలని, లేదంటే ఆందోళనలు చేపడుతామన్నారు. అనంతరం ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, కేశవ, గోవిందు, తిరుమల, గౌస్, బాషా తదితరులు పాల్గొన్నారు.


ఆదోని ఆర్టీసీ డిపో ఎదుట విద్యార్థుల నిరసన

అంగన్‌వాడీలకు చేరిన కందిపప్పు

స్పందనకు వందనం

ఆస్పరి, న్యూస్‌టుడే: ఆస్పరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 131 అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు వచ్చినట్లు సీడీపీవో మద్దమ్మ తెలిపారు. గత నెలలో కందిపప్పు అందకపోవడంతో నీళ్ల చారుతో సరిపెట్టారు. ఈ సమస్యలపై గత నెల 17వ తేదన ‘ఈనాడు’లో కథనం ప్రచురితమైంది. స్పందించిన సంబంధిత అధికారులు ఈ నెలకు సంబంధించిన కందిపప్పు కోటాను ఆయా కేంద్రాలకు పంపిణీ చేశారు. బాలింతలు, గర్భవతులకు, సక్రమంగా పంపిణీ చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


పి.విజయ్‌కుమార్

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి పి.విజయ్ కుమార్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని మాలతి తెలిపారు. మండల పరిధిలోని పందికోన గ్రామానికి చెందిన ఈ విద్యార్థి పత్తికొండలోని వసతి గృహంలో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 21న కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చటంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రాజేశ్, రజియాభాను, దేవి బాయి పాల్గొన్నారు.

మాకు సమాచారం ఇవ్వకుంటే ఎలా?

తుగ్గలి, న్యూస్‌టుడే: తనకు సమాచారం ఇవ్వకుండా తమ గ్రామానికి నిధులెలా ఇస్తారని ఇన్‌ఛార్జి ఎంపీపీ ఎర్రనాగప్పను కడమకుంట్ల ఎంపీటీసీ సభ్యురాలు ఆదిలక్ష్మి ప్రశ్నించారు. మండల పరిషత్ నిధులు రూ.2.50 లక్షలతో తాగునీటి పైపులైన్ పనులను సర్పంచి చేశారని, శిలఫలకంపై ఎంపీటీసీ సభ్యురాలి పేరు లేదన్నారు. తనకు తెలియకుండా మండల పరిషత్ నిధులు ఇతరులకు ఎలా కేటాయిస్తారో కలెక్టర్‌కు, జడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేస్తానన్నారు. దీంతో సర్పంచి అనుకూలమైన నాయకులు రాయబారానికి వచ్చినట్లు తెలిసింది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

దేవనకొండ, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషిచేయాలని ఏడీఏ సురేషకుమార్ అన్నారు. దేవనకొండ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం విద్యార్థులతో సమావేశమయ్యారు. దేవనకొండకు చెందిన ఆదర్శ రైతులు వేణుగోపాలురావు, సదాశివరావు అన్నదమ్ములు 1100 మొక్కలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవనకొండ, పత్తికొండ, తుగ్గలి, కృష్ణగిరికి చెందిన ఏవోలు సురేషబాబు, వెంకటరాముడు, పవన్, వెంకటేశ్, యోగేంద్ర, జయరాం, రంగన్న, ప్రధానోపాధ్యాయిని గంగావతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్కలు పంపిణీ చేస్తున్న పత్తికొండ ఏడీఏ విజయ్‌మోహన్, నిర్వాహకులు

చైనాలో పోటీపడటం అభినందనీయం


క్రీడాకారుడు మధుని సన్మానిస్తున్న తిక్కారెడ్డి, వీరభద్రగౌడ్

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సెపెక్‌తక్రాలో జాతీయ స్థాయిలో జట్లకు నాయకత్వం వహించి చైనాలో రజత పతకం సాధించిన మధును తెదేపా జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వీరభద్రగౌడ్ అభినందించారు. గురువారం ఆలూరులోని పార్టీ కార్యాలయంలో క్రీడాకారుడు మధుని సన్మానించారు. వారు మాట్లాడుతూ.. జిల్లాకు, ఆలూరు నియోజకవర్గానికి మంచి పేరు తెచ్చేలా క్రీడల్లో సత్తాచాటాలని సూచించారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనరు అశోక్‌యాదవ్, నాయకులు రాము, కురవ హనుమప్ప, అంబన్న, వన్నూరువలి, అంజి, రవియాదవ్, గోవిందు, భాజపా హాలహర్వి మండల కన్వీనరు బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే నవ భారత నిర్మాణం

మద్దికెర, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువతతోనే నవ భారత నిర్మాణం సాధ్యమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, ఎంపీడీవో స్వర్ణలత, ఎంఈవో గోపాల్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సవిత అన్నారు. మద్దికెర ఆదర్శ పాఠశాలలో గురువారం నిర్వహించిన దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్ విద్యానికేతన్ పాఠశాల నిర్వాహకులు రామాంజనేయులు, ఉపాధ్యాయ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.


మద్దికెర ఆదర్శ పాఠశాలలో ధ్రువపత్రాలతో విద్యార్థులు

పట్టణ శుభ్రతకు ప్రాధాన్యం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో శుభ్రత పనులకు ప్రాధాన్యం ఇస్తామని పురపాలక సంఘం కమిషనర్ కృష్ణ అన్నారు. ఎస్కేడీ.కాలనీలో గురువారం పర్యటించి ప్రజారోగ్య పనులను తనిఖీ చేశారు. అన్న క్యాంటిన్లో మెనూ అమలు, నిర్వహణపై ఆరా తీశారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలెప్పుడు?

దేవనకొండ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైందని, హామీలు మాత్రం నెరవేర్చడం లేదని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి విమర్శించారు. గురువారం దేవనకొండలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, నాయకులు లుముంబా, దివాకర్‌నాయుడు, చంద్రన్న, ప్రతాప్, అరుణ్, రాజన్న, తిరుమలేష్ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ యార్డు ధరలు

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం పలికిన వివిధ పంట దిగుబడుల ధరలు. పత్తి క్వింటాలు కనిష్ఠంగా రూ.4211, గరిష్ఠంగా రూ.7,531, మధ్య ధర రూ.7,349. వేరుసెనగ రూ.3260-7171-6419, ఆముదాలు రూ.4900-6042-6012లు పలికాయి.

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం

దేవనకొండ, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన అపవిత్రతకు నిరసనగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా దేవనకొండలోని వెంకటేశ్వర ఆలయంలో రెండు రోజుల నుంచి ఆలూరు జనసేన ఇన్‌ఛార్జి తెర్నేకల్ వెంకప్ప దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జగదీశ్, వీరేశ్, బడేసాబ్, ఉచ్చీరప్ప, రామంజనేయులు, చంటి, మహేశ్, మనోహర్, నాగరాజు, నందు, పరమేశ్ పాల్గొన్నారు.

17,498 చెత్త బుట్టలు మంజూరు

మద్దికెర, న్యూస్‌టుడే: స్వచ్ఛ కార్పొరేషన్ నుంచి 17,498 చెత్త బుట్టలు మంజూరైనట్లు ఈవోపీఆర్డీ మద్దిలేటిస్వామి తెలిపారు. గురువారం ఆయన మద్దికెర మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాలకు ఈ బుట్ట మంజూరయ్యాయన్నారు.

రహదారిపై హిజ్రాల హల్‌చల్


హిజ్రాలతో మాట్లాడుతున్న పోలీసులు

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలో హిజ్రాలు గురువారం హల్‌చల్ చేశారు. దుకాణాల ముందు గుంపులుగా నిలబడి రూ.వేలు డిమాండ్ చేస్తున్నారు. రెండు రోజుల కిందటే పట్టణ సీఐ జయన్న హిజ్రాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కానీ ఎలాంటి మార్పు రాలేదని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో దుకాణాల యజమానుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. డబ్బు ఇవ్వని వ్యాపారులతో వాగ్వాదానికి దిగుతూ, దుర్భాషలాడుతున్నారని వారు ఆరోపించారు. గుంపులుగా రహదారిపై చేరి వీరంగం సృష్టిస్తూ.. వాహనాలకు ఇబ్బంది కలిగించారు. పోలీసులు జోక్యం చేసుకొని వారిని అక్కడి నుంచి పంపించటంతో సమస్య సద్దుమణిగింది.

అధికారులకు వీడ్కోలు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పురపాలక సంఘంలో బదిలీ అయిన ఇంజినీరింగ్ అధికారులను ఘనంగా సన్మానించారు. డీఈలు నాగభూషణం రెడ్డి నంద్యాలకు, రాజునాయక్ ఎమ్మిగనూరుకు, ఏఈ కృపాకర్ గూడూరుకు బదిలీ అయ్యారు. వీరిని ఇంజినీరింగ్ సిబ్బంది సత్కరించారు.


ఇంజినీరింగ్ అధికారులను సన్మానిస్తున్న సిబ్బంది

సేవకు పురస్కారం



ఎస్పీ నుంచి అవార్డు అందుకుంటున్న వీరేంద్ర

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ మండలం హోసూరులో తెదేపా నాయకుడు వాకిటి శ్రీనివాసులు హత్య కేసులో నిందితులను గుర్తించి, వారి అరెస్ట్‌లో కీలకంగా వ్యవహరించిన పత్తికొండ ఎస్సై కానిస్టేబుల్ వై.వీరేంద్రను జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు. గురువారం కర్నూలు వ్యాస్ ఆడిటోరియంలో నిర్వహించిన నేర నియంత్రణ సమీక్ష సమావేశంలో ఉత్తమ పనితీరు కనబర్చిన వీరేంద్రకు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేశారు.


సమాచారమివ్వటంలో అలసత్వం వద్దు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖకు సంబంధించి ప్రజలు, రైతులు, ఇతరులు ఎవరైనా సమాచారం అడిగినప్పుడు నెల రోజుల వ్యవధిలోనే ఇవ్వాలని పత్తికొండ వ్యవసాయ సహాయ సంచాలకులు మోహన్‌విజయ్‌కుమార్ అన్నారు. పత్తికొండ ఏడీఏ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు.

సారా విక్రేత అరెస్టు

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలో శివారు ప్రాంతమైన పార్వతీకొండ సమీపంలో నాటుసారా అమ్ముతున్న ఎరుకల వెంకటస్వామి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై గోపాల్ తెలిపారు. ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అక్కాచెల్లెళ్లకు ఆర్థిక సాయం


చెక్కును అందజేస్తున్న రేణుకమ్మ, తదితరులు

ఆలూరు గ్రామీణం, హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన అక్కాచెల్లెళ్లకు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం భార్య రేణుకమ్మ రూ.85 వేల చెక్కును గురువారం అందజేశారు. ఆలూరులోని వారి నివాసంలో ఇద్దరి బాలికలతో పాటు గ్రామ పెద్దల సమక్షంలో వారికి చెక్కును ఇచ్చారు.

ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఓటరు జాబితాను పక్కాగా తయారు చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. ఆదోని కార్యాలయంలో గురువారం సాయంత్రం బీఎల్‌వోల సమావేశం నిర్వహించారు. ఇంటింటా ఓటరు జాబితా సర్వే, అర్జీల పరిష్కారం, తప్పులు తదితర వాటిపై సమీక్షించారు. సమావేశంలో తహసీల్దారు శివరాముడు, ఎన్నికల ఉప తహసీల్దారు రామేశ్వరరెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

అసంపూర్తి గదులు.. పాఠాలకు ఆటంకాలు



ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తికాలేదు. ఉన్న గదులు కూల్చి.. కనీసం కూర్చునేందుకు కూడా స్థలం లేకుండా చేసిన ఘనత వైకాపా ప్రభుత్వానిది. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమైనా.. అసౌకర్యాల నడుమనే చదువులు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. కనీస వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. – న్యూస్‌టుడే ఆదోని విద్య

మండలం:	ఆదోని
పాఠశాల:	ఆర్‌జీ నగర్ జడ్పీ పాఠశాల
విద్యార్థులు:	460
ప్రస్తుతం ఉన్న గదులు:	06
నిధులు:	రూ.50లక్షలు

అరకొర గదుల్లోనే..

ఆదోని పట్టణంలోని అమరావతినగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గదుల కష్టాలు తప్పడం లేదు. వరండాలో బోధన సాగిస్తున్నారు. ఇక్కడ 12 గదుల నిర్మాణాలు ప్రారంభించారు. రూ.14.50 లక్షలు విడుదల కాగా.. ఇందులో రూ.2.50 లక్షలు ఇతర పాఠశాలకు సర్దుబాటు చేశారు. ఫలితంగా రెండు అదనపు గదులు పునాదులకే పరిమితమయ్యాయి.

ఒక గది.. 100 మంది

ఆదోని మండలంలోని ఆర్‌జీ నగర్ జడ్పీ పాఠశాలలో 475 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక గదిలో వంద మంది విద్యార్థులు కూర్చుంటున్నారు. నాడు- నేడు కింద ఐదు గదులు మంజూరయ్యాయి. రూ.65 లక్షలతో అంచనాలు రూపొందించారు. కింద మూడు, పైన రెండు గదుల నిర్మాణాలు ప్రారంభించారు. పైకప్పు వరకు వచ్చింది. తీరా ఐదు గదుల నిర్మాణానికి అనుమతి లేదు, కేవలం ఒక గదికే ఇస్తామని ఉన్నతాధికారులు తేల్చారు.



చిక్కుముళ్లు దాటేదెలా!



జూటూరు(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. రూ.లక్షలు వృథా అవుతున్నాయి. పత్తికొండ మండల పరిధిలోని జూటూరులో వైకాపా ప్రభుత్వం రూ.20 లక్షల వ్యయంతో విలేజ్ క్లినిక్ భవనం నిర్మించింది. ప్రస్తుతం అది ముళ్ల కంపలు, దుర్గంధం మధ్య నిరుపయోగంగా మారింది. ఎన్నికల ముందు హడావుడిగా నిర్మాణం పూర్తయినట్లు చూపి అప్పటి ఎమ్మెల్యేతో ప్రారంభించారు. ప్రారంభమైనప్పటి నుంచి ఒక్క రోజు కూడా అందులో వైద్యసేవలు అందించలేదు. భవన నిర్మాణానికి సంబంధించిన సుమారు రూ.5లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో గుత్తేదారులు తాళాలు అప్పగించలేదు. క్లినిక్ చుట్టూ, ముందు ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో గ్రామస్థులు కొందరు అదే ప్రాంతంలో బహిర్భూమికి వినియోగిస్తుండటంతో కేంద్రం దరిదాపుల్లోకి వెళ్లడానికి కూడా వీల్లేని పరిస్థితి. కేంద్రం చుట్టూ ఉన్న ముళ్ల కంపలను తొలగించడంతో పాటు, పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

☛ ఈ విషయం పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా.. బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమేనన్నారు. విలేజ్ క్లినిక్‌లో వైద్య సేవలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కారును ఢీకొన్న ట్రాక్టర్


నుజ్జు నుజ్జు అయిన కారు

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలోని గుత్తి- ఆదోని బైపాస్ రోడ్డులో ట్రాక్టర్ కారును ఢీకొంది. మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకొని గురువారం తిరిగి వెళ్తున్న కారును, ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌కు టైరు పంచర్ కావడంతో ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు



కరపత్రాలను అందజేస్తున్న మండల ప్రత్యేకాధికారిణి

క్యూఆర్ కోడ్ నమోదు చేయించాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వంద రోజుల పాలనపై క్యూఆర్ కోడ్‌ను ప్రజలందరితో నమోదు చేయించాలని మండల ప్రత్యేకాధికారిణి రంగలక్ష్మీదేవి సూచించారు. గురువారం లద్దగిరి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వంపై ప్రజా వేదిక గ్రామసభ, ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అతికించడం, కరపత్రాలు పంపిణీ చేపట్టారు. వంద రోజుల్లో ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలను వివరించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

9,155 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయం నుంచి తుంగభద్ర నది దిగువకు 9,155 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ ఇంజినీర్ రాజు తెలిపారు. గురువారం నాటికి జలాశయంలో 1.235 టీఎంసీలు నిల్వ ఉండటంతో ఎగువ నుంచి వస్తున్న 9,155 క్యూసెక్కుల నీటిని రెండు గేట్లు ఎత్తి విడుదల చేస్తున్నామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794 కోడుమూరు : 80085 73776

ఎమ్మిగనూరు: **సమస్య:** పట్టణంలోని మాత్రాల తిమ్మప్ప కాలనీలో కుళాయి గుంత కోసం రోడ్డు తవ్వారు. సగంలో గుంతకు మట్టి వేసి పూడ్చకుండా వదిలేశారు. ఇప్పటికైనా గుంతను పూడ్చగలరు.

– శ్రీనివాసులు, కాలనీవాసి

సమాధానం: గుంతను పూర్తిగా మూసివేసేందుకు చర్యలు తీసుకుంటాం. – పురపాలక ఏఈ శరత్

లడ్డూ కల్తీకి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలి

మంత్రాలయం, న్యూస్‌టుడే: కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవమైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో లడ్డూ కల్తీకి పాల్పడ్డ వారిపై



తితిదే మాజీ ఈవో ధర్మారెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సభ్యులు

చర్యలు తీసుకోవాలని విరాట్ హిందూస్థాన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, అశోక్ మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం వారు మంత్రాలయంలోని గురురాఘవేంద్ర స్వామి క్షేత్రం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు అడివేశ్, ఇతర హిందూ సంఘాల నాయకులతో కలిసి రాఘవేంద్ర కూడలిలో ధర్నా చేపట్టారు. తితిదే మాజీ ఈవో ధర్మారెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వీరేశ్, బాస్కర్, సిరుగుప్ప దణి, పెద్దతుంబళం పరమేశ్, జోగేశ్ పాల్గొన్నారు.

గోనెగండ్లకు డెంగీ జ్వరం

✦ రోజురోజుకు పెరుగుతున్న కేసులు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: కాలానుగుణంగా వ్యాపించే విషజ్వరాలతో నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు రోగులతో నిండిపోతున్నాయి. ప్రతిరోజు ఆయా మండలాల్లోని ఆసుపత్రులకు వచ్చే ఓపీలో అధిక శాతం విష జ్వరాల బాధితులే. అపరిశుభ్రత, కలుషిత నీటి కారణంగా ఈ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతోనే జ్వర బాధితులు పెరుగుతున్నారని గ్రామీణులు ఆరోపిస్తున్నారు.

సెప్టెంబరులో వారం రోజుల్లోనే గోనెగండ్ల మండలంలోని చిన్నమర్రివీడులో రెండు, వేముగోడు, కైరవాడి గ్రామాల్లో నాలుగు డెంగీ కేసులు నమోదయ్యాయి. గతేడాది ఆగస్టులో గోనెగండ్లలో 8, నెరుడుప్పల, పిల్లిగుండ్లలో ఒక్కోటి చొప్పున వచ్చాయి. డెంగీ కేసులు పెరుగుతున్నా వైద్యాధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



చిన్నమర్రివీడులో దారిలో నిలిచిన మురుగు



ఇక్కడ కనిపిస్తున్న మురుగు ప్రాంతం గోనెగండ్ల మండలం వేముగోడు గ్రామంలోనిది. ఇక్కడ సుమారు 4 వేల జనాభా ఉంది. బీసీ కాలనీలో డెంగీ కేసు నమోదు కావడంతో వైద్యాధికారులు అప్రమత్తం చేశారు. కాలనీలోని అపరిశుభ్రత, మురుగు నిల్వను పరిశీలించారు. దోమల వ్యాప్తి, అపరిశుభ్ర పరిసరాలు, నీటి నిల్వతో కేసులు నమోదవుతున్నాయని చెబుతున్నారు. గురువారం గ్రామాన్ని సందర్శించిన జిల్లా మలేరియా నివారణ అధికారి నూకరాజు దోమల నివారణకు ఫాగింగ్, రసాయనిక మందుల పిచికారీ, పైపులైన్ లీకేజీలను అరికట్టాలని అధికారులను ఆదేశించారు.

ఏడాది	నెల	నమోదైన కేసులు
2023	ఆగస్టు	10
2024	సెప్టెంబరు	4

వైద్యులు పట్టించుకోరు

– రంగన్న, గోనెగండ్ల



నేను రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా. డబ్బుల్లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చా. రెండు గంటలైనా వైద్యులు పట్టించుకోలేదు. ప్రశ్నిస్తే విసుక్కుంటున్నారు. కింది స్థాయి సిబ్బందే తూతూ మంత్రంగా నాలుగు మందు గోళీలు చేతిలో పెట్టి పంపుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకం పోయింది.

అధికారులను అప్రమత్తం చేశాం

– డాక్టర్ కార్తీక్, ప్రభుత్వ ఆసుపత్రి

దోమల కారణంగా చిన్నమర్రివీడు, వేముగోడు, కైరవాడి గ్రామాల్లో డెంగీ కేసులు నమోదయ్యాయి. దీంతో వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిసరాలను పరిశీలించి అక్కడే వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను అప్రమత్తం చేశాం. గ్రామాల్లో ఎక్కడా మురుగు నిల్వ లేకుండా చూడాలని చెప్పాం. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి, స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయించాలి. అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి సూచనలు చేశాం.

వంద రోజుల ప్రణాళిక రూపొందించాలి

మంత్రాలయం, న్యూస్‌టుడే: వంద రోజుల ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. గురువారం ఆయన మంత్రాలయంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారు



మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ప్రభావతీదేవి, వెలుగు ఏపీఎం జయశ్రీ, ఎంఈవోలు మోహినుద్దీన్, రాగన్న పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉన్నతి సాధ్యం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సాంకేతిక రంగంలో రాణించిన విద్యార్థులకు ఉన్నత స్థాయి ఉద్యోగాలు సులభంగా సాధి



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక బృందం

స్తారని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రధానాచార్యుడు వీరన్న పేర్కొన్నారు. బెంగళూరుకు చెందిన టీపీపీ కంపెనీ గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో పలువురు విద్యార్థులను ఎంపిక చేసింది. వైస్ ప్రిన్సిపల్ సుధాకర్, ప్లేస్‌మెంట్ అధికారి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రెండు డెంగీ కేసుల నమోదు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని వేముగోడు, కైరవాడి గ్రామాల్లో రెండు డెంగీ కేసులు నమోదైనట్లు జిల్లా మలేరియా నివారణ అధికారి నూకరాజు పేర్కొన్నారు. గురువారం ఆయన ఆయా గ్రామాల్లో డెంగీ కేసులు నమోదైన బాధితుల ఇంటి పరిసరాలను డీఎల్‌వో నూర్జహాన్‌తో కలిసి పరిశీలించారు. దోమల వ్యాప్తి కారకమైన మురుగు నీటికుంటలు, అపరిశుభ్ర పరిసరాలపై పంచాయతీ సిబ్బందితో రసాయనిక మందులు పిచికారీ చేయించారు. కుంటల్లో నిల్వ నీటిని మోటార్లతో తొలగించారు. ఈ కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారి సాయిబాబా, వైద్య సిబ్బంది పరమేశ్, సుధాకర్, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

ఆటో నిండుగా.. ప్రాణాలు పణంగా



నిర్లక్ష్యంగా ప్రయాణిస్తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నా ప్రయాణికులు, వాహనచోదకుల్లో మార్పు రావడం లేదు. ఆటోల్లో పరిమితికిమించి ప్రయాణికులను తరలిస్తున్నారు. కోడుమూరు నుంచి వెల్దుర్తి వైపు వెళ్లే ఓ ఆటో సామర్థ్యానికి మించి తీసుకెళ్తూ కనిపించారు. అనుకోని ప్రమాదం సంభవిస్తే కుటుంబాలు రోడ్డున పడుతాయి, ఇప్పటికైనా అధికారులు ఇలాంటి ప్రయాణాలపై దృష్టి సారించి నివారించాలని పలువురు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

ప్రయాణం.. 'దారి'ణం



ఎమ్మిగనూరు-కర్నూలు రహదారి అధ్వానంగా తయారైంది. పెద్ద పెద్ద గుంతలు పడటంతో ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. ఎమ్మిగనూరు శివారులోని కర్నూలు రహదారిలో పెట్రోల్ బంకు పక్కన పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ దారిలో నిత్యం వందలాది వాహనాలు కర్నూలు, నంద్యాల, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. ఇప్పటికైనా రహదారిని బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు పట్టణం

గ్రామ స్థాయిలో ఉత్పాదకత సృష్టించాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ స్థాయిలో అభివృద్ధి మూలాలను వెలికితీసి ఉత్పాదకతను సృష్టించాలని మండల ప్రత్యేకాధికారిణి రంగలక్ష్మీదేవి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం స్వర్ణాంధ్ర-2047పై ప్రజాప్రతినిధులు, సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఏఎస్‌వో రఘువీరా పాల్గొన్నారు.

సెమిస్టర్-2 పుస్తకాల పంపిణీ

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సెమిస్టర్-2 పుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో-1 వసంతలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. మొత్తం 12 వేల పుస్తకాలు వచ్చాయన్నారు.

కళాశాల వేడుకలకు కలెక్టర్‌కు ఆహ్వానం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో ఈ నెల 29న నిర్వహించనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల 75 ఏళ్ల వేడుకలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు షఫీయుల్లా ఆహ్వానించారు. గురువారం కర్నూలులో కలెక్టర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. విశ్రాంత తహసీల్దార్లు అజయ్‌కుమార్, సయ్యద్ రోషన్‌వలి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలోని శివ కూడలిలో ఓ దుకాణంలో విద్యుత్తు పనులు చేస్తున్న మొయిన్ పాషా (19) బుధవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు గురువారం పట్టణ ఎస్సై డాక్టర్ నాయక్ తెలిపారు. బెంగళూరుకు చెందిన యువకుడు విద్యుత్తు పనుల నిమిత్తం ఎమ్మిగనూరుకు వచ్చారు. దుకాణంలో పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యారు. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై పేర్కొన్నారు.

తుంగభద్ర నదిలో వృద్ధురాలు..

మంత్రాలయం, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం మంత్రాలయంలో చోటుచేసుకుంది. నదిలో మహిళ మృతదేహం కనిపించడంతో స్థానిక దుకాణదారులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై పరమేశ్ నాయక్, సిబ్బంది రంగస్వామి నలుగురు యువకులను తీసుకెళ్లి

నేర సమాచారం

వృద్ధురాలి మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు. ఆధార్ కార్డు ఆధారంగా కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా చిక్కబూదూరు గ్రామానికి చెందిన లక్ష్మీదేవి (69)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆగిన కారును ఢీకొని ఒకరికి గాయాలు

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఆగి ఉన్న కారును ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. బెంగళూరు నుంచి మంత్రాలయానికి వస్తున్న కారు మండలంలోని చిలకలడోణ గ్రామ శివారులో గురువారం తెల్లవారుజామున మూత్ర విసర్జనకు రోడ్డు పక్కన ఆగారు. కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గకు చెందిన టెంపో వాహనం వెనుక నుంచి వచ్చి ఆగి ఉన్న కారును ఢీకొనడంతో అందులోని వికాస్ తలకు గాయాలయ్యాయి. ఆయన స్నేహితుడు షేక్ ఖాసీం సాహెబ్ ఫిర్యాదు మేరకు టెంపో డ్రైవర్ ప్రదీప్ ఆచారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తెదేపా.. అభివృద్ధి చేసే ప్రభుత్వం: ఎంపీ

కోసిగి, న్యూస్‌టుడే: తెదేపా అంటే మాటలు



ఎంపీ బస్తిపాటి నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి, సర్పంచి అయ్యమ్మ

చెప్పే ప్రభుత్వం కాదని, అభివృద్ధి చేసే ప్రభుత్వమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గురువారం ఆయన కోసిగిలో మంత్రాలయం నియోజకవర్గ తెదేపా నాయకుడు రాఘవేంద్రరెడ్డితో కలిసి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రైల్వే గేట్ వద్ద వంతెన నిర్మించాలని తెదేపా నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి కోరుతూ ఎంపీ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. మంత్రాలయం జనసేన నాయకులు లక్ష్మన్న, భాజపా మండల అధ్యక్షుడు రాముడు, నర్సారెడ్డి, రాకేశ్, జ్ఞానేశ్ పాల్గొన్నారు.

పేదలకు పథకాలు అందించడమే ధ్యేయం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పేదలకు సంక్షేమ పథకాలను అందించడమే తెదేపా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని లక్ష్మీపేటలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు



లక్ష్మీపేటలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

అందించారు. త్వరలో పట్టణంలో రూ.146 కోట్లతో పనులు చేపడతామన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతుండగా కుక్కలు గుంపులుగా రావడంతో ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే కాలనీలో కుక్కలు కనిపించకుండా చేయాలన్నారు. పురపాలక కమిషనర్ గంగిరెడ్డి, తెదేపా నాయకులు రామకృష్ణానాయుడు, షాబీర్, వీరేశ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కౌతాళం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెదేపా జిల్లా రైతు అధికార ప్రతినిధి సాయిబాబా అన్నారు. గురు



ఉప్పరహాల్‌లో తెదేపా రైతు అధికార ప్రతినిధి సాయిబాబా

వారం మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో వంద రోజుల పండగ, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, తెదేపా నాయకులు టిప్పుసుల్తాన్, దస్తగిరి, ఈరన్న, మల్లయ్య పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాధనకు సీఎం కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

కె.నాగలాపురం (గూడూరు గ్రామీణం), న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర సాధనకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. మండలంలోని కె.నాగలాపురంలో సర్పంచి నయోమి ఆధ్యక్షతన గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి పథకాలపై అవగాహన కల్పించి స్టిక్కర్లు అతికించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ పర్యవేక్షకుడు రామలింగారెడ్డి, మండల ప్రత్యేకాధికారిణి సబిహ పర్వీన్, ఎంపీడీవో విజయసింహారెడ్డి, తహసీల్దార్ కె.రామాంజనేయులు, కార్యదర్శి సౌందర్య పాల్గొన్నారు.

పౌష్టికాహారం పక్కదారి పడితే చర్యలు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం మండలంలోని కె.నాగలాపురంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన పోషణ వేడుకను పరిశీలించారు. గుడ్లు, పాలు తదితర సరకులను కార్యకర్తలు ఇళ్లకు తీసుకెళ్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. కె.నాగలాపురం సెక్టారులోని అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు, ఆయాలు, పర్యవేక్షకురాలు రాజమ్మ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

కె.నాగలాపురం (గూడూరు గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని కె.నాగలాపురం సుంకులమ్మ అమ్మవారిని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ పర్యవేక్షకుడు రామలింగారెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో నరసయ్య వారికి స్వాగతం పలికి సన్మానించారు. వారి వెంట తెదేపా నాయకులు శ్రీనివాసులు, సురేశ్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీమఠంలో ప్రముఖులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ ఛైర్మన్ నరేంద్ర స్వామి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు దుర్యోధన మహాలింగప్ప, అబ్బయ్య ప్రసాద్ గురువారం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంత్రాలయం వచ్చారు.

పరిమితి మించితే చర్యలు తప్పవు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలో పాఠశాలల వాహనాల్లో విద్యార్థులను పరిమితికిమించి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని గోనెగండ్ల సీఐ గంగాధర్ అన్నారు. గురువారం గాజులదిన్నె ప్రాజెక్టు అడ్డు రోడ్డు వద్ద విద్యార్థులను తరలిస్తున్న ఆటోలను సీఐ తనిఖీ చేశారు.

డీఈగా రాజునాయక్ బాధ్యతల స్వీకరణ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పురపాలక సంఘం డీఈగా రాజునాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఆదోని డీఈగా పని చేస్తూ బదిలీపై ఎమ్మిగనూరు వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన డీఈ మనోహర్‌రెడ్డి బదిలీపై కర్నూలు కార్పొరేషన్‌కు వెళ్లారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని ప్రభుత్వ బాలికల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి అన్నారు. గురువారం ఆయన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని సౌమ్యను అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయిని సృజనకుమారి, నాగేశ్వరి పాల్గొన్నారు.

పరుగుపందెంలో ఉరుకుంద విద్యార్థికి స్వర్ణ పతకం

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే: కౌతాళం మండలం ఉరుకుంద జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి నాగరాజు పరుగుపందెంలో బంగారు పతకం సాధించాడు. కర్నూలులో జిల్లా స్థాయిలో అండర్-14 విభాగంలో 400 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. గురువారం విద్యార్థితోపాటు పీడీ ఈరన్నను పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుమలతాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

28 నుంచి పాఠశాల క్రీడా పోటీలు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 28 నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు తైమూరు బాషా గురువారం తెలిపారు. జీవీఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.

గ్రీన్ ఎమ్మిగనూరు లక్ష్యం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పచ్చదనం పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రతి కాలనీలో మొక్కలు నాటి గ్రీన్ ఎమ్మిగనూరు చేయడమే లక్ష్యమని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సాయినగర్ కాలనీలో రోడ్లకు ఇరువైపులా 80 మొక్కలను నాటారు. ప్రభుత్వం తరపున నాటిన మొక్కలను ఆయా ఇంటి యజమానులు, కాలనీవాసులు దత్తత తీసుకుని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ మదన్ కుమార్, కాలనీవాసి గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న పురపాలక కమిషనర్ గంగిరెడ్డి

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మిరపలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిం



మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి

చడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి అన్నారు. గురువారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మిరప సాగులో చేపట్టాల్సిన చర్యలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర మౌనిక, డీఆర్సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏవోలు వరప్రసాద్, శశిధర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు శ్రీచందన, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

సాగులో మేలు రకం విత్తనాలు కీలకం

గోనెగండ్ల, న్యూస్‌టుడే: రైతులు తప్పకుండా మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకుంటే



డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త, ఏడీఏ

అధిక దిగుబడులు పొందవచ్చని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుజాత సూచించారు. గురువారం వేముగోడు గ్రామంలో ఏవో హేమలత శనగ సాగుపై రైతులకు శిక్షణ నిర్వహించారు. కేవీకే సమన్వయకర్త, ఏడీఏ మహ్మద్ ఖాద్రీ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ సహాయకులు జాకీర్, లక్ష్మన్న పాల్గొన్నారు.

వరి పంటపై పొలం బడి

కొండాపురం (సి.బెళగల్), న్యూస్‌టుడే: పొలం బడిలో భాగంగా వరి పంట సాగులో రసాయనిక మందులు వాడకుండా తక్కువ ఖర్చుతో జీవామృతంతో అధిక దిగుబడులు ఎలా సాధించవచ్చో ఏవో మల్లేశ్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. గురువారం



జీవామృతం తయారీని చూపిస్తున్న ఏవో మల్లేశ్‌కుమార్

ఆయన మండలంలోని కొండాపురం గ్రామంలో రైతులకు క్షేత్ర స్థాయిలో సేంద్రియ ఎరువుల తయారీపై వివరించారు. సిబ్బంది శేఖర్, రాజశేఖర్ నాయక్, వీహెచ్‌ఏ వెంకటేశ్వర్లు, సోమేశ్వరి, రైతులు మధుసూదన్‌రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

చెరువుకు శాశ్వత పరిష్కారం చూపండి

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్ చెరువులో నిత్యం నీటి నిల్వ ఉండేందుకు పులకుర్తి ఎత్తిపోతల పథకానికి పెద్ద గొట్టాలు అమర్చి తుంగభద్ర నది నుంచి నీటిని మళ్లించి నింపాలని మండల ప్రజాప్రతినిధులు తీర్మానించారు. గురువారం మండల పరిషత్తు కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారిణి శ్యామల సర్పంచులు, విద్యా కమిటీ ఛైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో రాముడు, ఈవోఆర్డీ సందీప్, ఎంపీపీ మునెప్ప, సర్పంచులు హనుమంతు, పాండురంగన్న, నాగలక్ష్మి పాల్గొన్నారు.

కళాశాలకు బస్సు ఏర్పాటు చేయండి


ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎర్రకోట ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు రవాణ వసతి సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ ఆఫ్రిది కోరారు. గురువారం ఆర్టీసీ డిప్యూటీ డీఎం నాగరాజును కలిసి వినతి పత్రం అందజేశారు. 150 మంది బస్సు పాసుకు డబ్బులు చెల్లించారన్నారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలో స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమం కింద విద్యార్థులకు ఎమ్మార్సీ కార్యాలయంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు మండల విద్యాధికారులు రామాంజనేయులు, నీలకంఠ గురువారం తెలిపారు. అలాగే రెండో సెమిస్టర్ కింద మండలానికి వచ్చిన 34 వేల పాఠ్య పుస్తకాలను ప్రధానోపాధ్యాయులకు అందించారు. సీఆర్పీలు రవికుమార్, కవిత, శ్రీనివాసులు, గోవింద్ పాల్గొన్నారు.

రైతు నేస్తాలకు రాయితీలు

- న్యూస్‌టుడేతో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు రాంసుబ్బారెడ్డి



ముఖాముఖి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు, వ్యవసాయ కూలీలు పంటల సాగుతోపాటు ఇతర మార్గాలతో ఆదాయం పెంపొందించుకుంటుంటారు. సాధారణంగా రైతుల నేస్తాలు ఎడ్లు, పాలిచ్చే ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పొట్టేళ్లకు వర్షాకాలం, చలికాలంలో రోగాలు ఎక్కువగా వస్తుంటాయి. వాటి పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రభుత్వం అందించే రాయితీలపై కోడుమూరు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డా.రాంసుబ్బారెడ్డి 'న్యూస్‌టుడే'తో వివరించారు.

గొర్రెలు, మేకలకు పారుడు రోగం వస్తుంది. దాని నుంచి బయటపడేందుకు ఉచితంగా టీకాలు వేస్తాం. గొర్రెల, మేకల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

మినీ గోకులం పథకం కింద రైతులు షెడ్లు ఏర్పాటు చేసుకోవచ్చు. రెండు సెంట్ల స్థలం, ఉపాధి పథకానికి సంబంధించిన జాబ్ కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతాకు సంబంధించిన పాసుపుస్తకం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

★ పశువులకు సోకే గాలికుంటు వ్యాధితో నోట్లో, గిట్టల దగ్గర పుండ్లు వస్తాయి. పాలిచ్చే పశువులు నుంచి పాల దిగుబడి తగ్గుతుంది. వ్యవసాయ పనులు చేసే ఎద్దులకు బలం తగ్గి పని చేయలేవు. వాటి నివారణకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఈ సీజన్‌లో ఎక్కువగా శ్వాసకోస వ్యాధులు వస్తుంటాయి. వర్షానికి తడవకుండా, పరిశుభ్రమైన ప్రదేశంలో ఉంచాలి. మూడు రోజుల పాటు వైద్య సేవలందించాలి.

పశువులున్న వారికి పశుకిసాన్ కార్డు కింద రుణ సౌకర్యం కల్పిస్తున్నాం. ఏడు శాతం వడ్డీతో పశువుకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు రుణాలు పొందవచ్చు. గరిష్ఠంగా ఎనిమిది పశువులు (ఆవులు, గేదెలు) వరకు రూ.1.60 లక్షలు రుణం ఇస్తారు.

★ పొలాలు, బురద, తడి నేలల్లో, మట్టితో గిట్టలకు వ్యాధులు వస్తాయి. గిట్టలకు రావడంతో నొప్పితో నడవలేక ఇబ్బందులు పడుతాయి. పశువుల ఆసుపత్రిలో వాటికి పెన్సిలిన్ వేయించాలి.

★ పొదుగు వాపు రాకుండా జాగ్రత్తలు పాటించాలి. పశువులను పరిశుభ్రంగా ఉంచాలి. పాలు పిండే ముందు పొదుగు కడిగి గుడ్డతో తుడవాలి. పొదుగులో పాలను పూర్తిగా పిండాలి. పాలు పిండటం పూర్తయిన తర్వాత 15 నిమిషాలపాటు పశువులు పడుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గడ్డలుంటే దగ్గరలోని పశు వైద్యశాలలో వైద్యమందించాలి.

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

కళాకారుల ప్రతిభ వెలుగులోకి రావాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: యువ కళాకారుల ప్రతిభ వెలుగులోకి తీసుకురావడానికి జిల్లా



గెలుపొందిన వారితో అతిథులు

యువజన, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సెట్కూరు సీఈవో దీప్తి పేర్కొన్నారు. నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో జిల్లా యువజన శాఖ, సెట్కూరు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం యువజన, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వారు రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ వీవీఎస్ కుమార్ మాట్లాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్‌రెడ్డి, ఫామీదబేగం, హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్తు అంతరాయం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: నగరంలో శుక్రవారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి గురువారం తెలిపారు. అంబేడ్కర్ నగర్, గో గ్యాస్, దివ్యా హోటల్, విజయకుమార్‌రెడ్డి ఫ్యాక్టరీ, డీఆర్ఆర్ మిక్చర్ తదితర పరిశ్రమలకు త్రీఫేస్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ రూరల్ ఏడీఈ సుబ్బన్న వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: సమస్య: పాతనగరం రాధాకృష్ణ థియేటర్ సమీపంలోని కాలనీల్లో రహదారులు అధ్వానంగా మారాయి. -స్థానికులు

సమస్య: వీకర్ సెక్షన్ కాలనీలోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. శుభ్రం చేయాలి. -స్థానికులు

సమాధానం: సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం. -నగరపాలక అధికారులు

ప్రజా సంక్షేమమే ధ్యేయం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. కల్లూరు 30వ వార్డు శరీన్‌నగర్‌లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారన్నారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాలలో సీస్ బ్రైటర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, వార్డు ఇన్‌ఛార్జిలు, భాజపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.

తిరుమలలో డిక్లరేషన్‌పై సంతకం పెట్టాలి: సోమిశెట్టి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: తిరుమలలో డిక్లరేషన్‌లో సంతకం పెట్టి గుండు కొట్టించుకొని, మూడు నామాలు పెట్టుకొని గుడి చుట్టూ వంద ప్రదక్షిణలు చేస్తావా అని జగన్ మోహన్‌రెడ్డిని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. నగరంలోని 25వ వార్డు దేవనగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి తిరిగి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేస్తూ స్టిక్కర్లను అతికించారు. పార్టీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి నవీన్, కర్నూలు పార్లమెంట్ అనుబంధ కమిటీల అధ్యక్షులు హనుమంతరావు చౌదరి, షేక్ ముంతాజ్, లక్ష్మి, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెదేపా నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, పక్కన సోమిశెట్టి

పర్యాటక వైభవం

◆ పలు ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

◆ రూ.3.33 కోట్ల నిధులు కేటాయింపు

ఓర్వకల్లు, కర్నూలు విద్య, న్యూస్‌టుడే : గత తెదేపా ప్రభుత్వ హయాంలో పర్యాటక ప్రాంతాలు విశేష ఆదరణ పొందాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో హరిత హోటళ్లు వెలిశాయి. ఆదాయం మెరుగుపడింది. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నిధులు కేటాయించకపోవడంతో నిర్వహణ అటకెక్కింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పూర్వ వైభవం సంతరించుకుంది. శుక్రవారం పర్యాటక దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ఓర్వకల్లులోని రాక్ గార్డెన్స్ గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఎంతో అభివృద్ధి చెందింది. 2004లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 220 ఎకరాలు కేటాయించి నిధులు మంజూరు చేశారు. దశలవారీగా రాతి వనాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించింది. 2014లో రూ.5 కోట్లు మంజూరు చేయగా 20 ఏసీ గదులు, ఏసీ రెస్టారెంటు, నాన్ ఏసీ రెస్టారెంటుతోపాటు కొండలపై వంతెనలు ఏర్పాటు చేశారు. పలు సినిమాల చిత్రీకరణ జరిగింది. పర్యాటక శాఖకు మంచి ఆదాయం సమకూరింది. తర్వాత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్ర



నగర శివారులోని నగర వనం

బాబు నాయుడు పర్యాటక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గార్గేయపురం, జగన్నాథగట్టు, కేతవరం గుహలు, రూపాల సంగమేశ్వర స్వామి ఆలయం, రాక్ గార్డెన్స్ తదితర ప్రాంతాలకు సులువుగా రాకపోకలు సాగించేందుకు ప్రభుత్వం రూ.3.33 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో రహదారులు నిర్మిస్తారు.

వనాలపై ప్రత్యేక దృష్టి

నగరవాసులు నిత్యం పని ఒత్తిడితో అలసిపోతుంటారు. వారాంతపు రోజు బయటకు వెళదామన్నా అనువైన ప్రదేశాలు కానరాని పరిస్థితి. ఈ నేపథ్యంలో జనం ఆహ్లాదంగా గడిపేందుకు.. చిన్నచిన్న శుభకార్యాలు జరుపుకొనేలా నగర శివారులోని నగర వనం, విజయవనాన్ని అటవీ శాఖ అధికారులు తీర్చిదిద్దారు. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ప్రత్యేక ఆట స్థలాలను తీర్చిదిద్దారు. నగర వనంలో తిరిగేందుకు ప్రత్యేక వాహనం ఏర్పాటుచేశారు. ఇక్కడ లోనికి వెళ్లాలంటే తప్పనిసరిగా ఆధార్ నంబరు చెప్పాలి. చిన్న పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.20 ప్రవేశ రుసుము ఉండగా.. వాహనాలకు రూ.30 నుంచి రూ.50 వరకు రుసుము నిర్ణయించారు. కాగా నగరవనం, విజయ వనానికి ప్రతి నెలా సుమారు 3 వేల మంది వస్తుంటారు.

☛ గార్గేయపురం వద్దనున్న నగర వనానికి సమీపంలో ఉన్న పిల్లిగుండు వద్ద 'నగర వన్ యోజన' పథకం కింద సుమారు 50 హెక్టార్లలో అటవీ ప్రాంత అభివృద్ధికి సుమారు ప్రభుత్వం రూ.1.40 కోట్లు కేటాయించింది.

పోలీసులకు ఫిర్యాదు చేయండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: తన పేరు చెప్పుకొని ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వారిపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ తన పేరును దుర్వినియోగం చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెడితే సహించేది లేదన్నారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో మల్టిపుల్ గ్రేడింగ్ యూనిట్ నిర్వాహకుడిని మంత్రి భరత్ పేరు చెప్పి వేధింపులకు గురి చేశారని వచ్చిన కథనాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ కాటాదారుల సంఘం నాయకులు కె.శ్రీనివాసులు, ఎల్లయ్య, బీరప్ప తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో మంత్రికి ఎలాంటి సంబంధం లేదని వారు తెలిపారు. మంత్రి భరత్ పేరు చెప్పి కమిటీ అధికారులు తమపై ఎలాంటి బెదిరింపులకు పాల్పడలేదని, డబ్బులు డిమాండ్ చేయలేదని మార్కెట్ కమిటీ వ్యాపారులు ఒక ప్రకటనలో తెలిపారు.

1,277 మందికి పంట నష్ట పరిహారం : కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో 615.455 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అంచనా వేశారు. 1,277 మంది రైతులకు రూ.1.26 కోట్ల పంట నష్ట పరిహారం పంపిణీ చేయాలని ప్రభుత్వానికి నివేదించినట్లు జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి గురువారం తెలిపారు.

గుంతల మార్గం.. తప్పదు ప్రమాదం

కర్నూలు కొత్త బస్టాండ్ సమీపంలో.. కేకే భవన్‌కు వెళ్లే మార్గంలో రహదారి గుంతలమయంగా మారింది. వాహనదారులు రాకపోకలు సాగే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ





జీవితం.. పొగబారుతుంది

కర్నూలు బళ్లారి చౌరస్తా నుంచి ఆటోనగర్ వరకు జాతీయ రహదారి ఆనుకుని సర్వీసు రోడ్డు నిర్మించారు. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున చెత్తాచెదారాలు వేస్తున్నారు. దీనికితోడు నిప్పు పెడుతుండటంతో జాతీయ రహదారి పొగతో నిండిపోయింది. ఫలితంగా వాహన చోదకులు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది.

– న్యూస్‌టుడే, కర్నూలు విద్య

వేతన బకాయిలు ఇవ్వాలి

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగరపాలక పరిధిలో పని చేస్తున్న క్లాప్ వాహన డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. నగరపాలక కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మారెళ్ల విజయ రామాంజనేయులు మాట్లాడుతూ.. గత 9 నెలలుగా జీతాలు



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, క్లాప్ వాహన డ్రైవర్లు

లేకపోవడంతో క్లాప్ వాహన డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కుటుంబ జీవనం ప్రశ్నార్థకంగా మారిందని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

క్రైం కార్నర్

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పంచలింగాల వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బలరాం(27) మృతి చెందారు. కర్నూలు నగరానికి చెందిన బలరాం తెలంగాణ రాష్ట్రంలోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై తన స్నేహితుడు రాజ్‌కుమార్‌తో కలసి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బలరాం అక్కడికక్కడే మృతి చెందగా రాజ్‌కుమార్‌కు కాళు విరిగింది. బలరాం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గార్గేయపురంలో ఇరువర్గాల ఘర్షణ

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: గార్గేయపురంలో పీర్ల చావిడి స్థల వివాదం రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. కర్నూలు మండలం గార్గేయపురం మాబుసాని దర్గాకు సంబంధించిన స్థల విషయంలో రెండు మైనారిటీ కుటుంబాలు పరస్పరం గురువారం దాడి చేసుకున్నాయి. ఇరువర్గాల వారికి స్వల్ప గాయాలు కావడంతో చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా సమాచారం అందుకున్న కర్నూలు తాలూకా పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఓ వర్గానికి చెందిన వ్యక్తిపై తాలూకా ఎస్సై తీరు వివాదాస్పదంగా మారింది. దీనిపై దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీపై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలు ముజఫర్‌నగర్‌కు చెందిన అవంతిక ఇంట్లో చోరీ ఘటనపై కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఏడాది జులైలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోని మూడున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు బాధితురాలు బుధవారం పోలీసుస్టేషన్ ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

రాయితీపై విత్తనాలు అందజేయాలి

వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: రైతులకు రాయితీపై విత్తనాలు అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, సీపీఐ



మాట్లాడుతున్న రైతు సంఘం నేత జగన్నాథం

జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. నగరంలోని సీఆర్ భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వారితోపాటు ఏపీ చేతి వృత్తుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు పాల్గొని మాట్లాడారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని చెప్పిన కేంద్రం ఇప్పటివరకు పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.

48,897 మంది అభిప్రాయాల సేకరణ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్ రూపకల్పనకు సంబంధించి జిల్లాలో ఇప్పటివరకు 48,897 మంది క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలు తెలిపారని కలెక్టర్ రంజిత్‌బాషా గురువారం తెలిపారు. జిల్లాలో 619 గ్రామసభలు నిర్వహించామని.. ఇందులో 1.69 లక్షల మంది పాల్గొన్నట్లు చెప్పారు. 7.40 లక్షల స్టిక్కర్లు, 7.40 లక్షల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

ధీర వనిత ఐలమ్మ

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: పెత్తందారులకు రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి ఎంతో మందికి స్ఫూర్తి నింపిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని కర్నూలు జిల్లా రజక విద్యాసేవా సమితి వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు సీపీ వెంకటేశ్ అన్నారు. పెద్ద మార్కెట్ సమీపంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్, ఉపాధ్యాయులు సూర్యకుమారి, రాయలసీమ రజక సాధికార కమిటీ కన్వీనర్ లింగమయ్య, న్యాయవాదులు శంకరన్న, మహిళా నాయకురాలు ఉష్ణ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయుడు తదితరులు

ఆర్థిక సాయం మరువలేనిది

ఓర్వకల్లు న్యూస్‌టుడే: మండలంలోని లొద్దిపల్లెకు చెందిన 211 బూత్ ఇన్‌ఛార్జి మధు కంటి పరీక్షకు ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి తనయుడు రూ.1.50 లక్షల నగదును అందజేయడం మరవలేనిదని తెదేపా గ్రామ నాయకులు పరమేశ్వరరెడ్డి అన్నారు. మధు కంటి ఆపరేషన్ చేయించుకుని విజయవంతం కావటంతో గురువారం గౌరు జనార్దన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద గిడ్డయ్య, కర్రెన్న గౌడ్, మహేశ్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని సెక్రటరీ



పుస్తకాలు అందజేస్తున్న కుమార్

ప్రకాష్ పిలుపునిచ్చారు. నగరానికి చెందిన కుమార్ జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.20 వేలు విలువ చేసే వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు గురువారం అందించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఎంతో ఉపయోగకరమన్నారు.

ఎస్సీ వసతిగృహాల్లో బయోమెట్రిక్ తప్పనిసరి

కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే: ఎస్సీ వసతి గృహాల్లో బయోమెట్రిక్ తప్పనిసరి పాటించాలని వార్డెన్‌లను సాంఘిక సంక్షేమశాఖ జేడీ రంగలక్ష్మీదేవి ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో వసతి గృహ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. వసతిగృహాల్లో ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు జరగకుండా పర్యవేక్షించాలని, విద్యార్థులకు వైద్య పరీక్షలు స్థానిక పీహెచ్‌సీ వైద్యులతో చేయించాలని సూచించారు. ఏఎస్‌డబ్ల్యూవో మద్దిలేటి, బాబు, వసతిగృహ అధికారులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వానం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఐదో శక్తిపీఠంగా విరాజిల్లుతున్న శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ ఈవో పురేందర్ కుమార్ గురువారం కలెక్టర్ పి.రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జోగులాంబ జిల్లా అలంపూర్ జోగులాంబదేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను ఆహ్వానించారు. అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు రావాలని కర్నూలులోని ఆయన కార్యాలయంలో ఆలయ ఈవో పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకుడు ఆనందశర్మ, సీనియర్ అసిస్టెంట్ శేఖర్ గురువారం ఆహ్వాన పత్రికను అందజేశారు.

కాలనీ కబుర్లు

వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : విద్యుత్తు శాఖ కర్నూలు డివిజన్ ఈఆర్‌వో కార్యాలయంలో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా చంద్రబోస్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మిగనూరులో పనిచేస్తున్న ఆయన్ను కర్నూలుకు బదిలీ చేశారు.

వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం కాకుండా అందరూ పోరాడాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు మునెప్ప, రాధాకృష్ణ, రామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పేర్కొన్నారు. వారు గురువారం మాట్లాడుతూ కార్మిక, రైతు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు దీక్షలు చేపట్టనున్నట్లు చెప్పారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగరంలోని 129, 130వ వార్డు సచివాలయాల పరిధిలో కర్నూలు నగరపాలక మేనేజర్ చిన్నరాముడు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటి వెళ్లి ప్రజలకు కరపత్రాలను అందజేసి స్టిక్కర్లను అతికించారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు పాతనగరం గడియారం ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందిని నియమించాలని, మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు కర్నూలు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చారు.

ఓర్వకల్లు న్యూస్‌టుడే: ప్రభుత్వం అందించే పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఓంకార్ యాదవ్ సూచించారు. మండలంలోని పూడిచెర్లలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం గురువారం చేపట్టారు. మాజీ సర్పంచి ప్రకాశం, నాయకులు పుల్లారెడ్డి, తిరుపాలు పాల్గొన్నారు.

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: డీఎస్ఏ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాల బాలికలకు అథ్లెటిక్స్, ఈత, షూటింగ్, స్కేటింగ్, అండర్-17 మాడ్రన్ పెంటాథలన్, అండర్-19 విభాగంలో కబడ్డీ, ఫుట్‌బాల్, యోగా, కుస్తీ, జూడో పోటీలను ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు హర్షవర్ధన్, గిడ్డయ్య ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయులు పరమేష్, నరసప్ప, చిట్టి ప్రసాద్, జయకుమార్, పద్మావతి, ఓబన్న పాల్గొన్నారు.

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 28న అన్ని పీహెచ్‌సీల పరిధిలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రేబిస్ టీకాలపై అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ గురువారం తెలిపారు. ఈ ఏడాది 7,028 కుక్క కాటు కేసులు నమోదైనట్లు చెప్పారు. వీరందరికి టీకాలు వేయడంతో ఎలాంటి మరణాలు సంభవించలేదని చెప్పారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కలెక్టరేట్ ఏవోగా విజయశ్రీ బాధ్యతలు స్వీకరించారు. ఈమె ప్రస్తుతం సి.బెళగల్ తహసీల్దారుగా ఉన్న ఆమె బదిలీపై కలెక్టరేట్ ఏవోగా వచ్చారు.

'ముడుపులు తీసుకుని బదిలీలు'

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లా సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీల్లో భారీగా అక్రమాలు జరిగాయని సచివాలయ ఉద్యోగులు నిరసన తెలిపారు. తాము బదిలీలకు దరఖాస్తు చేసుకోకపోయినా తమను జిల్లా సరిహద్దు ప్రాంతాలకు బదిలీ చేశారని.. తమకు అనుకూలమైన వారిని జిల్లా కేంద్రంతోపాటు పరిసర ప్రాంతాలకు ముడుపులు తీసుకొని బదిలీ చేశారని వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని.. సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఏకపక్షంగా బదిలీలు చేశారని వారు కలెక్టర్, డీఆర్వోకు గురువారం ఫిర్యాదు చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన బదిలీల ప్రక్రియ కలెక్టరేట్ అధికారులు చేశారని వాపోయారు.

స్వచ్ఛతాహి సేవలో పాల్గొనాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: స్వచ్ఛతాహి సేవలో ప్రతి విద్యార్థి పాల్గొనాలని రాయలసీమ విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త పి.నాగరాజు పేర్కొన్నారు. ఆర్‌యూలో కర్నూలు బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాల్లో గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న సమయంలో రక్తం లభించక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఎన్‌ఆర్ శత జయంతి వేడుకలు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో ఈ నెల 27 నుంచి 29 వరకు అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్‌ఆర్) శత జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య గురువారం తెలిపారు. 27వ తేదీ సాయంత్రం నృత్య నీరాజనం, 28న ఏఎన్‌ఆర్ నటించిన ప్రేమనగర్ చలన చిత్రం ప్రదర్శన ఉంటుందన్నారు.

పోటీలు సజావుగా నిర్వహించాలి

కర్నూలు క్రీడలు(బి.క్యాంపు), న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులంతా కలిసి విజయవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సూచించారు. ఈ నెల 28వ తేదీన ఎస్‌జీఎఫ్ పాణ్యం నియోజకవర్గ స్థాయి పోటీలకు సంబంధించి ఆహ్వాన పత్రికను ఆమె స్వగృహంలో గురువారం అందజేశారు. ఈ పోటీలు పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు చంద్రవతమ్మ తెలిపారు. తెదేపా నాయకుడు గౌరు వెంకటరెడ్డి, పాణ్యం ఎంఈవో-2 సుబ్రహ్మణ్యం, జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడు నాగగోపేశ్వరరావు, కర్నూలు జిల్లా సహాయ వ్యాయామ విద్య అధ్యక్షుడు పెరుమాళ్ల శ్రీనాథ్, కర్నూలు సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మల్లికార్జున పాల్గొన్నారు.

గోడ పత్రాల ఆవిష్కరణ

కర్నూలు బి.కాంపు, నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావాలు పెంచుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సూచించారు. నగరంలోని కోల్స్ కళాశాలలో చైల్డ్ ఇవాంజెలిజం ఫెలోషిప్ ఆఫ్ ఇండియా కర్నూలు ఆధ్వర్యంలో 13వ చిల్డ్రన్ క్యాంప్ గుడ్ న్యూస్ 2024 గోడపత్రికను డైరెక్టర్ రెవ.జె.ప్రభుదాస్, కమిటీ ఛైర్మన్ అనీల్‌నాథ్, కోల్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి.విజయ్‌కుమార్‌లతో కలిసి విడుదల చేశారు. అక్టోబర్ 7 నుంచి 9వ తేదీ వరకు కళాశాలలో చిల్డ్రన్ క్యాంప్ గుడ్ 2024 కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దేవాలయాల నిర్వహణ హిందూ సమాజానికి అప్పగించాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: దేవాలయాల నిర్వహణ హిందూ సమాజానికి అప్పగించాలని వీహెచ్‌పీ కేంద్రీయ కార్యకారిణి సభ్యులు రాఘవులు కోరారు. కర్నూలులోని వీహెచ్‌పీ కార్యాలయంలో గురువారం జరిగిన ఉమ్మడి జిల్లాల విభాగ్ సమావేశంలో మాట్లాడారు. సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తిని ఛైర్మన్‌గా ధార్మిక సంస్థల ప్రతినిధులను సభ్యులుగా కమిటీ వేయాలని కోరారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డిసాయిరెడ్డి, ప్రాణేష్, సుబ్రహ్మణ్యం, టీసీ మద్దిలేటి, చంద్రమౌళి, ఈశ్వర్‌రడ్డి, భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.


కళా నైపుణ్యం.. జన చైతన్యం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: యువతలోని ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. జిల్లా యువజన సంక్షేమశాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో ఏటా యువజనోత్సవం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జిల్లా స్థాయి యువజనోత్సవం, సాంస్కృతిక పోటీలను గురువారం నగరంలోని సిల్వర్‌జూబ్లీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి అందరి మన్ననలు అందుకున్నారు.



జానపద నృత్యం చేస్తున్న యువతులు

జాతీయస్థాయిలో రాణించేలా..



ఫోక్ డ్యాన్స్‌లో రాణిస్తున్న ధరణి కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతది. తల్లిదండ్రులు బసవమ్మ, బసవరాజు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి స్వగ్రామం ఎమ్మిగూరు. ఆమె 2023 సెప్టెంబరులో సిల్వర్ జూబ్లీ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో ఫోక్ డ్యాన్స్‌లో మొదటి బహుమతి అందుకున్నారు. ఈ ఏడాది జనవరిలో నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచారు. 2024 ఫిబ్రవరి మొదటి వారంలో కేరళలో జరిగిన జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించారు. జాతీయ స్థాయి పోటీల్లో తొలి స్థానం సాధించడమే లక్ష్యమని.. ఇందు కోసం సాధన చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఆసక్తి పెంచుకుని..



తన గాత్రంతో యువతను చైతన్యపరచడమే లక్ష్యంగా రజిత ముందుకు సాగుతున్నారు. ఆమె నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. తల్లిదండ్రులు చంద్రకళ, లక్ష్మన్న. తండ్రి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వీరి స్వగ్రామం కొంగనపాడు. చిన్నప్పటి నుంచి సంగీతంపై ఆసక్తి ఉండటంతో పాఠశాల స్థాయి నుంచి పాటలు పాడుతూ.. ఎన్నో బహుమతులు గెలుచుకున్నారు. తొలిసారిగా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటున్న ఆమె ఎలాగైనా గెలవాలనే దృఢ సంకల్పంతో ఉన్నారు.

జానపద గేయాలతో..



గ్రామాల్లో సామాజిక చైతన్యం కోసం జానపద గేయాలు నేర్చుకున్న రాజశేఖర్‌రెడ్డి నగరంలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ మొదటి సంవత్సరం చదువుతున్నారు. తల్లిదండ్రులు లక్ష్మీదేవి, జయరాముడు. తండ్రి అనారోగ్యంతో మూడేళ్ల కిందట చనిపోయారు. జానపద గేయాలు వెలుగులోకి తేవడమే తన లక్ష్యమని, గ్రామాల్లో చైతన్యం రావాలంటే జానపద కళాకారులకే సాధ్యమని రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అందుకే తొలిసారిగా ప్రదర్శన చేస్తున్నట్లు వివరించారు.

విద్యుత్తు చౌర్యం చేస్తే చర్యలు

వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: విద్యుత్తు చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కర్నూలు జిల్లా ఈఈ (డీపీఈ) ప్రదీప్‌కుమార్ హెచ్చరించారు. కర్నూలు సి.క్యాంపు సమీపంలో గురువారం దాడులు జరిపారు. విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుని జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

తాఖీదు జారీ

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగరం 17వ వార్డు సచివాలయ అమినిటీ సెక్రటరీ షేక్ ఇమ్రాన్ హుస్సేన్‌కు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు గురువారం మెమో జారీ చేశారు.